PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 1 | విజయవాడ, మంగళవారం 2 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 2 September 2025 | Rs

## సోషలిజంతోనే దేశానికి భవిష్యత్తు

- ఆర్ఎస్ఎస్, బిజెపి చెప్పేదొకటి, చేసేదొకటి
- సోషలిజం, లౌకికవాదం పదాలంటే ఎందుకు భయం : బివి రాఘవులు

2

## సూపర్-4కు భారత్

- చివరి లీగ్‌లో కజకిస్తాన్‌పై 15-0తో గెలుపు
- 3న దక్షిణ కొరియాతో ఢీ

8

# ఆఫ్ఘన్‌లో భారీ భూకంపం

- 800 మందికి పైగా మృతి
- 2,500 మందికి గాయాలు
- నేలమట్టమైన ఇళ్లు.. అపార ఆస్తి నష్టం
- సాయం అందిస్తున్న ప్రపంచ దేశాలు

**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్ తూర్పు ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో భారీ భూకంపం సంభవించింది. రాజధాని కాబూల్ నుండి పొరుగున గల పాక్ రాజధాని ఇస్లామాబాద్ వరకు ఈ ప్రభావం కనిపించింది. భవనాలు నిలువెల్లా కంపించాయి. ఈ దుర్ఘటనలో 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 2,500 మంది గాయాల పాలయ్యారు. 12 లక్షల మందికి పైగా ప్రజలు ఈ భూకంప ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం వుందని అమెరికా భూగర్భ సర్వే (యుఎస్‌జిఎస్) అంచనా వేసింది. ఇప్పటికే నాలుగు దశాబ్దాల యుద్ధం కారణంగా మానవతావాద సంక్షోభంతో విలవిలలాడుతున్న ఈ దక్షిణాసియా దేశాన్ని భూకంపం మరింతగా కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో ఆదివారం అర్ధరాత్రి కునార్, నంగర్‌హార్ రాష్ట్రాలను తాకిన భూకంపం పెను విధ్వంసాన్ని, అపార నష్టాన్ని మిగిల్చింది. ఆ తర్వాత వరుసగా పలు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. తెల్లవారు జామున 4 గంటలకు సంభవించిన ప్రకంపనం తీవ్రత కూడా 5.2గా నమోదైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో మెజారిటీ ప్రజలు మట్టితో, ఇటుకలతో కట్టిన ఇళ్లలోనే నివసిస్తారు. ఇవి కూలిపోవడానికి ఎక్కువ అవకాశం వుంటాయి. నంగర్‌హార్ రాష్ట్రంలోని జలాలాబాద్ నగరానికి ఈశాన్యంగా 27 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం వుంది. భూమిలో కేవలం ఎనిమిది కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం వుండడంతో భారీ నష్టం వాటిల్లింది. నుర్ గుల్, సోకీ, వాత్పూర్, మనోగి, చపాదర్, చాకే, షిగాల్ జిల్లాలు బాగా దెబ్బతిన్నాయి. నంగర్‌హార్, లగ్మన్, నురిస్తాన్ రాష్ట్రాలకు కోలుకోలేని అపారనష్టం సంభవించింది. వందలాది నివాస గృహాలు పూర్తిగా కూలిపోవడమో లేదా దెబ్బతినడమో జరిగింది. మజర్ మిగతా 7లో

ఆఫ్ఘన్‌లోని కునార్ రాష్ట్రంలో కుప్పకూలిన ఇళ్లు

# అసెంబ్లీకి రండి... చర్చిద్దాం!

- వైసిపికి బాబు సవాల్
- పింఛన్లపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం
- రాయలసీమకు స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ సంస్థలు
- రాజంపేట ప్రజావేదికలో సిఎం చంద్రబాబునాయుడు

రజకులతో మాట్లాడుతున్న చంద్రబాబు

**ప్రజాశక్తి- కడప ప్రతినిధి**

'రాష్ట్రంలోని ఫేక్ పార్టీ (వైసిపి)కి చెందిన బ్లూ మీడియా అడిగితే సమాధానాలు చెప్పాలా? ఆ పార్టీకి చెందిన 11 మంది ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి రావడానికి సిద్ధమా? వస్తే అన్నింటిపైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రాయలసీమకు స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ సంస్థలు రానున్నాయని తెలిపారు. రెండేళ్లలో సంజీవని ప్రాజెక్టుతో అత్యుత్తమ వైద్య సేవలు అందనున్నాయన్నారు. పింఛన్లపై సోషల్ ఆడిట్ నిర్వహించి అనర్హులను తొలగిస్తామని, అర్హులకు అన్యాయం జరగకుండా చూస్తామని తెలిపారు. సోమవారం ఆయన అన్నమయ్య జిల్లా మిగతా 7లో

# 'ఏకపక్షానికి' నిరసన

- దేశాల హక్కులు గౌరవించాలి
- తియాన్‌జిన్ డిక్లరేషన్ పిలుపు
- పహల్గాం ఉగ్ర దాడికి ఖండన
- గాజాలో యుద్ధోన్మాద చర్యలపై ఆగ్రహం


ఎస్‌సిఒ డిక్లరేషన్ సందర్భంగా సదస్సుకు హాజరైన వివిధ దేశాల అధినేతలు

**తియాన్‌జిన్ (చైనా) :** అంతర్జాతీయ సమాజంలో వివిధ దేశాల హక్కులు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీసుకునే చర్యలకు షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సభ్య దేశాలు తీవ్ర నిరసనను వ్యక్తం చేశాయి. పరస్పరం చట్టబద్ధ హక్కులను గౌరవించుకోవాలని షాంఘై సదస్సు ముగింపు సందర్భంగా సోమవారం విడుదల చేసిన డిక్లరేషన్‌లో పిలుపునిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌తో పాటు అనేక దేశాలపై ఏకపక్షంగా టారిఫ్‌ల యుద్ధం చేస్తున్న నేపథ్యంలో షాంఘై డిక్లరేషన్‌లో ఈ అంశాలు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, డిక్లరేషన్‌లో ఎక్కడా అమెరికాను, టారిఫ్‌లను నేరుగా ప్రస్తావించలేదు. అదే సమయంలో ఆధిపత్య ధోరణలను విడనాడాలని అంతర్జాతీయ సమాజానికి ఈ సదస్సు పిలుపు నిచ్చింది. రాజకీయ, సామాజిక, ఆర్థిక సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేసేలా ప్రస్తుతం ప్రపంచం చారిత్రక మార్పులకు లోనవుతోందని డిక్లరేషన్ పేర్కొంది. ఆర్థిక స్వభావం కలిగిన వాటితోపాటు ఏకపక్షంగా తీసుకునే అన్ని రకాల ఆధిపత్య, బెదిరింపు చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు డిక్లరేషన్ తెలిపింది. షాంఘై సదస్సుకు హాజరైన సభ్య దేశాలన్నీ పహల్గాం ఉగ్ర దాడిని ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాయి. ఈ దాడిలో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. ఇలాంటి దాడులకు కుట్రలు పన్నేవారిని, అమలుచేసే వారిని, మద్దతు ఇచ్చే వారిని చట్టం ముందు నిలపాలని డిక్లరేషన్‌లో సభ్యదేశాలు పేర్కొన్నాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ దానిని ఖండించాల్సిందేనని తియాన్‌జిన్ సదస్సు తీర్మానించింది. సీమాంతర ఉగ్రవాదుల మిగతా 7లో

# నేడు మరో అల్పపీడనం

## మోస్తరు నుంచి భారీ వర్షాలు
## విపత్తుల నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాగల 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. ఈ నెల 2న విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లా గుర్లలో సోమవారం సాయంత్రం 5 గంటలకు 76.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లావేరులో 65.5 మిల్లీమీటర్లు, మన్యం జిల్లా జియమ్మవలసలో 63.7, అనకాపల్లి జిల్లా నరసింగపల్లిలో 60 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రం 5 గంటలకు గోదావరి వరద నీటి మట్టం 44.4 అడుగులు ఉందన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 11.91 లక్షల క్యూసెక్కులు ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద సోమవారం సాయంత్రం 5 గంటలకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉందని, దాదాపు మొదటి హెచ్చరిక స్థాయి వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం తగ్గే వరకు పొంగిపొర్లే నదులు, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
# అమెరికా టారిఫ్‌లను ఎదుర్కోవాలి

- రైతుల ఆందోళనలకు మద్దతు
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై టిడిపి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- పోలవరం నిర్వాసితుల కష్టాలు పట్టడం లేదు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా పడుతోందని, దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవితో కలిసి ఆయన మాట్లాడారు. అమెరికా టారిఫ్‌లతో రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతుంటే టిడిపి, జనసేన, వైసిపి స్పందించడం లేదన్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తున్నా, ఈ పార్టీలు ఎందుకు మౌనంగా ఉన్నాయో, ఎదుర్కోడానికి ఎందుకు సిద్ధపడటం లేదో అర్థం కావడం లేదన్నారు. టారిఫ్‌ల వల్ల రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఆక్వా రంగం దెబ్బతిందని, ఎగుమతి చేయాల్సిన సరుకు ఎక్కడికక్కడ నిలిచిపోయి, రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు. వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలన్నారు. టారిఫ్ పెంపుతో వచ్చే ఇబ్బందులను గుర్తించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక అధ్యయన కమిటీని నియమించి ఎలా ఎదుర్కోవాలనేది పరిశీలన చేయాలన్నారు. ఏడాదికి రూ.1600 కోట్ల ఆదాయం తెస్తున్న ఆక్వా రంగానికి ఎగుమతి సబ్సిడీ ఇవ్వవచ్చని, విద్యుత్, ఫీడ్, సీడ్ రేట్లపై రాయితీలు ప్రకటిస్తే తట్టుకుని నిలబడుతుందని అన్నారు. ఆక్వా రంగంలో సగం ఎగుమతులు అమెరికాకేనని, దానికి ప్రత్యామ్నాయ మార్కెట్లను మిగతా 7లో

### బహుళధృవ ప్రపంచాన్ని బలపర్చాలి

దేశ మూలాలను భారత్ అమెరికా సంబంధాలు దెబ్బతీస్తున్న నేపథ్యంలో భారత్ చైనా సంబంధాల పునరుద్ధరించబడటం మంచి పరిణామమని, దానిని ఆహ్వానిస్తునానమని శ్రీనివాసరావు తెలిపారు. ట్రంప్, మోడీ దోస్తులుగా ఎన్నికల్లో పరస్పరం ప్రచారం కూడా చేసుకున్నారని అయినా భారతదేశానికి అమెరికా కనీస విలువ ఇవ్వకపోగా తీవ్రంగా ఇబ్బందులు పెడుతోందని తెలిపారు. అమెరికాతో వ్యూహాత్మక బంధం ఉన్నంతకాలం ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. బహుళ ధృవప్రపంచం వైపు భారత్ వెళ్లాలని, బలపర్చాలని అన్నారు. అమెరికా ఏకఛత్రాధిపత్యం బద్ధలవుతోందని, చిన్న, చిన్న దేశాలు కూడా దాన్ని సవాల్ చేస్తున్నాయని తెలిపారు. చైనా ఒక్క గజం కూడా భారతదేశ భూమిని తీసుకోలేదని పార్లమెంటులో కేంద్రం తెలిపిందన్నారు. రష్యావల్ల అయిల్ ధర నిలకడగా ఉందని, లేకపోతే ఆకాశానికి పాకేదని అన్నారు. అమెరికా మాట వింటే నష్టపోయేవారిమని అన్నారు. అమెరికా తొత్తుగా ఉన్న సౌదీ అరేబియా కూడా ఇప్పుడు బహుళ ధృవ ప్రపంచంవైపు వస్తోందని అన్నారు.

## పేదల విద్యకు సిబ్బంది లేకపోతే ఎలా?

- ప్రభుత్వాలకు హైకోర్టు ప్రశ్న

**ప్రజాశక్తి-అమరావతి**

సర్వశిక్ష అభియాన్ స్కీంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థల్లో శాశ్వత బోధనా సిబ్బంది లేకపోతే విద్యా ప్రమాణాలు ఎలా బాగుంటాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ప్రశ్నించింది. కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కెజిబివి) తమను అన్యాయంగా తొలగించారంటూ పలువురు పిజిటిలు 2023లో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్లను తొలగించడం చట్టవిరుద్ధమని గతంలో సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. దీనిపై ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను బెంచ్ విచారిస్తూ ముఖ్యంగా పేద విద్యార్థులుండే ఆ విద్యా సంస్థల్లో విద్యార్థులకు గెస్ట్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు లెక్చరర్లతో విద్యా బోధన చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదంది. ఈ సమస్య కొలిక్కి తెచ్చేందుకు తీసుకునే చర్యలపై నివేదికలు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది.

# రాజ్యాంగాన్ని దెబ్బతీసే చర్యలు సహించం

- ఓటు అధికార్ యాత్ర ముగింపు సభలో 'ఇండియా' నేతలు
- ఈసారి హైడ్రోజన్ బాంబ్ : రాహుల్
- ర్యాలీని అడ్డుకోవడంతో రోడ్డుపైనే నేతల ప్రసంగాలు

ఓటు అధికార్ యాత్ర ముగింపు సభలో పాల్గొన్న ఇండియా వేదిక నేతలు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

చారిత్రాత్మక పోరాటాల గడ్డ బీహార్‌లో 'ఓటరు అధికార్ యాత్ర' ప్రతిపక్ష ఐక్యతకు శక్తిమంతమైన ప్రదర్శనగా ముగిసింది. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తున్న ఎన్నికల సంఘానికి పాట్నాలో లక్షలాది మంది ప్రజలు గట్టి హెచ్చరిక చేశారు. బీహార్‌లో బిజెపి - జెడియు ప్రభుత్వ పునాది కదిలిపోయిందనే రాజకీయ సందేశాన్ని కూడా ఓటరు అధికార్ యాత్ర ప్రకటించింది. చంపారన్ సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఆందోళన, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటానికి వేదికైన పాట్నాలోని గాంధీ మైదాన్‌లో యాత్ర ముగింపు సభ నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి ఆదివారమే తరలివచ్చిన వేలాది మంది గాంధీ మైదాన్‌లో బస చేశారు. సోమవారం ఉదయం వివిధ కేంద్రాల నుండి వేలాదిమంది ఊరేగింపులతో గాంధీ మైదాన్‌కు తరలివచ్చారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ నేతృత్వంలో జమాల్ రోడ్డులోని సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యాలయం నుంచి జరిగిన ప్రదర్శనలో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఐ, సిపిఐ ఎంఎల్, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీల కార్యకర్తలు కూడా ప్రదర్శనలకు రావడంతో గాంధీ మైదాన్ జనసముద్రంగా మారింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ తదితర నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. 'ఓటు చోర్ హడ్డీ చోడ్!' (ఓటు దొంగలు.. సింహాసనాన్ని ఖాళీ చేయండి..!) అనే నినాదాలు హోరెత్తాయి. మహాత్మా గాంధీకి నివాళులర్పించిన తరువాత నాయకులు అంబేద్కర్ పార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా జనసంద్రం కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా నినాదాలతో పాట్నా పురవీధులన్నీ దద్దరిల్లాయి. నగరంలోకి ఎక్కువమంది ప్రవేశించకుండా నిరోధించడానికి పోలీసులు రోడ్లను మూసివేశారు. అంబేద్కర్ పార్క్‌కు 'ఓటు అధికార్ యాత్ర'కు మిగతా 7లో

## క్వాంటం వ్యాలీలో ఐబిఎంకు అనుమతి

- అమరావతిలో తొలి ప్రతిష్టాత్మక సంస్థ
- ప్రభుత్వ ఉత్తర్వులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసిసి) ఏర్పాటులో ఐబిఎంకు అనుమతినిస్తూ ఐటిశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఇప్పటికే క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ రంగ సంస్థగా ఏక్యూసిసి ఏర్పాటవుతుంది. వీటిల్లో పరిశోధనలు, యూనివర్సిటీలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు వీలుగా క్వాంటం వ్యాలీ సేవలు అందిస్తుంది. దీనిలో రెండువేల చదరపు అడుగుల్లో 133 క్యూబిట్, 5కె గేట్ క్వాంటం కంప్యూటర్‌ను ఐబిఎం ఏర్పాటు చేయనుంది. దీనికోసం ఆధునిక కూలింగ్ సిస్టం, అంతరాయం లేని విద్యుత్ అందించనున్నట్లు జిఒలో పేర్కొంది. చదరపు అడుగుకు రూ.30 అద్దె నిర్ణయించింది. అయితే ఐబిఎం నాలుగేళ్లపాటు విద్యాపరమైన అంశాల్లో ఏడాదికి 365 గంటల ఫ్రీ కంప్యూటింగ్ టైమ్‌ను ప్రభుత్వానికి అందిస్తుంది. అలాగే విట్ యూనివర్సిటీ క్యాంపస్‌లో రూ.6 కోట్ల వ్యయంతో బెంగుళూరుకు చెందిన క్యూపై ఎఐ మరో క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తుంది.

# భారత్‌పై మళ్లీ ట్రంప్ అవాకులు

## జీరో టారిఫ్‌లకు అంగీకరించి, జాప్యం చేస్తోందని వ్యాఖ్య

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌కు సంబంధించి అవాకులు చెవాకులు మాట్లాడారు. టారిఫ్‌లను జీరో స్థాయికి తగ్గించుకుంటామని భారత్ ప్రతిపాదించిందని మరోసారి చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ఇప్పటికే ఆలస్యం జరిగిందని, వారు (భారత్) దీనిని చాలా ఏళ్ల క్రితమే చేసి ఉండాల్సిందని పేర్కొన్నారు. అమెరికాకు భారత్‌తో వాణిజ్య బంధం 'ఏకపక్షమే'నని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రెసిడెంట్ పుతిన్‌లను కలిసిన కొన్ని గంటల తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "భారత్‌తో మనం చాలా తక్కువ వ్యాపారం చేస్తాం. కానీ వారు మనతో అపారమైన వ్యాపారం చేస్తారని చాలా తక్కువ మందికి అర్థం అవుతుంది. మరోమాటలో చెప్పాలంటే, వారు(భారత్) మనకు భారీ మొత్తంలో వస్తువులను అమ్ముతారు, మనం వారికి అమ్మేది చాలా తక్కువే. ఇప్పటివరకు ఉన్నది ఏకపక్ష సంబంధమే. చాలా దశాబ్దాలుగా ఉన్నది ఇదే" అని ఆయన రాసుకొచ్చారు. భారత్ విధించిన అధిక సుంకాలు అమెరికా వ్యాపారాలు అక్కడ (భారత్) వస్తువులను అమ్మకుండా నిరోధించాయని వివరించారు. ఈ పరిస్థితి పూర్తిగా ఏకపక్ష విపత్తుకు దారి తీసిందని చెప్పారు. భారత్.. చమురు, సైనిక ఉత్పత్తులను రష్యా నుంచి ఎక్కువగా, అమెరికా నుంచి చాలా తక్కువగా కొనుగోలు చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఎస్‌సిఒ సమావేశాల్లో భాగంగా భారత్, చైనా, రష్యా ఒకే వేదికపైకి రావటం ట్రంప్‌ను మరింత కలవరపెడుతున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను, విద్యార్థులను వేధించొద్దు

- యుటిఎఫ్, మోడల్ స్కూల్స్ సబ్ కమిటీ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మోడల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ చేయడానికి ఉపాధ్యాయులను, విద్యార్థులను వేధించడం సబబు కాదని యుటిఎఫ్, మోడల్ స్కూల్స్ సబ్ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, సబ్ మోడల్ స్కూల్స్ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ బాలాజీ సోమవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు రెండు క్యాలెండర్లను పాటిస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరంలో 250 రోజులకు పైగా, స్టడీ అవర్స్‌తో కలుపుకుంటే 300 రోజులకు పైగా పనిచేస్తూ తీవ్ర పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కొత్తగా ఇచ్చిన ఉత్తర్వుల వల్ల వారిపై మరింత పనిభారం పెరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశక్తి కార్యక్రమం ఇతర అన్ని యాజమాన్యాలకు ఐచ్ఛికమని కమిషనర్ చెబుతూనే మోడల్ స్కూళ్లకు మాత్రం తప్పనిసరి చేయడం సరికాదని తెలిపారు. ఊరికి దూరంగా ఉండే మోడల్ స్కూళ్ల విద్యార్థులను ఉదయం 8 గంటలకే పాఠశాలలకు పిలిపించి సాయంత్రం 5 గంటల వరకు ఉంచడంతోపాటు భోజన సమయంలో కూడా పరీక్షలు పెట్టి హింసించడం సబబు కాదని పేర్కొన్నారు. 9 గంటలపాటు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, విద్యార్థులు కూర్చుని చదవడం చేయాలని ఏ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రతిపాదించలేదని తెలిపారు. విద్యాశాఖ నిర్ణయాలు ఉపాధ్యాయులను, విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# సోషలిజంతోనే దేశానికి భవిష్యత్తు

- తిండి, ఇల్లు, విద్య, ఆరోగ్యం, నీరుపై హక్కు కల్పించాలి
- ఆర్‌ఎస్ఎస్, బిజెపి చెప్పేదొకటి, చేసేదొకటి
- సోషలిజం, లౌకికవాదం పదాలంటే భయమెందుకు : బివి రాఘవులు

సెమినార్ లో మాట్లాడుతున్న బివి రాఘవులు

**ప్రజాశక్తి- భీమవరం**

సమాజంలో సోషలిజంపై రోజురోజుకీ గౌరవం, అభిమానం పెరుగుతోందని, సోషలిజంతోనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. కులం, ఆర్థిక అంతరాలతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఇవి లేకపోతే సగం సమస్యలే ఉండవని వివరించారు. ప్రతి కుటుంబానికీ, ప్రతి మనిషికీ తిండి, ఇల్లు, విద్య, ఆరోగ్యం, నీరు హక్కుగా కల్పించేందుకు రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'సోషలిజం-విశిష్టత' అనే అంశంపై పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని త్యాగరాజ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమినార్‌కు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త బివి.రాఘవులు మాట్లాడుతూ సోషలిజంపై ఆదరణ, అభిమానం పెరుగుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బిజెపి, ఆర్‌ఎస్ఎస్ నేతలకు భయం పుట్టుకొస్తోందన్నారు. అమెరికాలో యువతపై ఒక సర్వే చేస్తే వంద మందిలో 50 మంది సోషలిజం రావాలని కోరుకుంటున్నారని వెల్లడైందని తెలిపారు. రాజ్యాంగంలో ఉన్న లౌకిక -సోషలిస్టు అనే రెండు పదాలు ఉండకూడదని ఆర్‌ఎస్ఎస్ చీఫ్ ప్రకటించడం, కేంద్రంలోని బిజెపి మంత్రులు కూడా ఈ పదాలను తొలగించాలని చెప్పడమే వారి భయానికి నిదర్శనమని వివరించారు. విశ్వవిద్యాలయాల్లో అభ్యుదయవాదులు సోషలిజంపై ఆలోచన చేయడం అభినందనీయమని, ఈ తరం కాకపోయినా తర్వాత తరమైనా సోషలిజాన్ని చూస్తారని అన్నారు. కనీస అవసరాలు తిండి, విద్య, వైద్యం, ఇల్లు, నీరు హక్కుగా ఉన్న సోషలిస్టు దేశాలు అభివృద్ధి దిశలో ఉన్నాయని వివరించారు. కులవ్యవస్థను నిర్మూలిస్తేనే సమాజం నిజమైన అభివృద్ధి దిశలో ఉంటుందన్నారు. ఏ దేశంలో అయితే స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందో అక్కడ ఉత్పత్తితోపాటు అభివృద్ధి కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రపంచ దేశాల్లోని యుద్ధాలను ఉపయోగించుకుని ఈ మూడేళ్లలో అంబాని 16 బిలియన్ల ఆస్తి పెంచుకున్నారన్నారు. పేద, ధనికుల మధ్య వ్యత్యాసం మనదేశంలోనే ఎక్కువగా ఉందని తెలిపారు. బీహార్‌లో లక్షలాదిమంది ప్రజల ఓట్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ విద్యుత్తు పోరాటం తర్వాత ఏ ప్రభుత్వమూ విద్యుత్తు ఛార్జీలు పెంచలేదన్నారు. అయితే, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నాయని, అందుకు చైనాలో జరిగిన సమ్మిట్ నిదర్శనమని అన్నారు. చైనాలో సైన్స్‌తో అద్భుతాలు చేస్తున్నారని, మన దేశంలో ప్రజాప్రతినిధులే మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని తెలిపారు. సోషలిజమే సమాజాభివృద్ధికి దిక్సూచి అని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవిష్యత్తులో కచ్చితంగా సోషలిజమే ప్రత్యామ్నాయంగా ముందుకొస్తోందన్నారు.

**ట్రంప్ సుంకాలు 'పశ్చిమ'పై పెనుప్రభావం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వల్ల పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం పడిందని రాఘవులు తెలిపారు. రొయ్యల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. 50 శాతం సుంకాలతో ధర తీవ్రంగా పతనం కావడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం ప్రసంగించారు. రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మంత్రులు, అధికారులు

## చంద్రబాబుకు పలువురు అభినందనలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలువురు మంత్రులు, ప్రభుత్వ అధికారులు అభినందనలు తెలిపారు. తొలిసారిగా ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనను సోమవారం ఉండవల్లిలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాలనా అంశాలు, ప్రజా సేవల విషయంలో తీసుకున్న పలు నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, చేపట్టిన కార్యక్రమాలపై తన అనుభవాలను చంద్రబాబు వారితో పంచుకున్నారు. గతంలో విజయవంతమైన పాలసీలను అధ్యయనం చేసి నేటి అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని చెప్పారు. అధికారులైనా, ప్రజా ప్రతినిధులైనా ఒక తపనలో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, జలవనరులు, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జి సాయిప్రసాద్, ఎమ్‌టి కృష్ణబాబు, జి జయలక్ష్మి, జిఎడి ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ హిమాన్షు శుక్లా, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వర్ల కుమార్ రాజా, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు నాగుల్ మీరా, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నీలాయపాలెం విజయ్‌కుమార్, డూండీ రాకేష్ తదితరులు ఉన్నారు.

## రూ.3 కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు

ఆర్ఆర్ఆర్ఎల్ఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** గ్రంథాలయాల అభివృద్ధికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలపై చర్చించినట్లు రాష్ట్ర లైబ్రరీ ప్రణాళిక కమిటీ (ఎస్-ఎల్‌పిసి) తెలిపింది. కోల్‌కతాలోని రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (ఆర్ఆర్ఆర్ఎల్ఎఫ్) డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో ఆమోదించిన రాష్ట్ర లైబ్రరీ ప్రణాళిక కమిటీ (ఎస్-ఎల్‌పిసి) సమావేశం సోమవారం జరిగింది. ఫౌండేషన్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.3 కోట్ల నిధుల వినియోగంపై సమావేశంలో చర్చించారు. ఎపి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు గ్రంథాలయాలను ఆధునీకరించాలని నిర్ణయించారు. రాజమండ్రి, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నంలోని ప్రాంతీయ గ్రంథాలయాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రంథాలయాల ఆధునీకరణకు ప్రతిపాదనలు తయారు చేశారు. జ్ఞాన కోణాలు (నాలెడ్జ్ కార్నర్స్), పిల్లల గ్రంథాల యాలు, శతాబ్ది ఉత్సవాలు, వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు వంటి ఆర్ఆర్ఆర్ ఎల్ఎఫ్ నాన్ మ్యాచింగ్ పథకాల కింద ప్రతిపా దనలను ఎపి నుండి పంపాలని కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో కోల్‌కతాకు చెందిన ఆర్ఆర్ఆర్ఎల్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అజయ్ ప్రతాప్ సింగ్, ఎపి ప్రజా గ్రంథాలయాల విభాగం డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, ఎపి గ్రంథాలయ పరిషత్ సభ్యులు మగతాల పద్మజ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఐదేళ్లయినా 'అన్నమయ్య'ను పట్టించుకోరా?

- పిసిసి అధ్యక్షులు షర్మిల

**ప్రజాశక్తి - కడప:** అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఐదేళ్లు గడిచినా పునర్ నిర్మాణానికి దిక్కులేదని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం ఆమె కడపకు వచ్చారు. స్థానిక డిసిసి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మందిని బలిగొన్న విపత్తులో జరిగిన నష్టాన్ని పూడ్చే మనసు ప్రభుత్వాలకు లేకుండా పోయిందని విమర్శించారు. ఐదు ఊళ్లు కొట్టుకుపోతే పునరావాసానికి రూపాయి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాలు కలిసి అన్నమయ్య ప్రాజెక్ట్‌ను అనాథ ప్రాజెక్ట్‌గా మార్చాయన్నారు. డ్యామ్ నిర్మాణం కోసం సర్వేల పేరుతో చంద్రబాబు సైతం కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాజంపేట వేదికగా మళ్లీ మాయమాటలు చెప్పారు తప్పిస్తే ప్రాజెక్ట్ నిర్మాణంపై దిశానిర్దేశం లేకపోవడం శోచనీయమన్నారు. అన్నమయ్య కన్నీటి వ్యథకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్, కలెక్టర్

## ఉల్లి రైతుల దోపిడీకి ట్రేడర్ల యత్నం

- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించిన మంత్రి
- మళ్లీ సరుకుకు ధర నిర్ణయంతో కలెక్టర్ జోక్యం

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్**

ధర లేక బయట తక్కువ ధరకు ఉల్లిని అమ్ముకుంటున్నారని పత్రికల్లో కథనాలు రావడంపై స్పందించిన ముఖ్యమంత్రి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లను పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ ప్రారంభించారు. అధిక వర్షాల వల్ల పంట నష్టం చాలా ఉందని, దిగుబడి తగ్గిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇంకా సాయం చేయాలని పలువురు రైతులు మంత్రిని కోరారు. మంత్రి వెళ్లిపోయిన వెంటనే మార్కెట్‌లోని ఉల్లికి ట్రేడర్లు ధర కట్టారు. ప్రభుత్వం కొంటుందో లేదో స్పష్టత లేకపోవడంతో ట్రేడర్లు చెప్పిన ధరకు రైతులు విక్రయించారు. సోమవారం మార్కెట్‌కు 1609 క్వింటాళ్ల ఉల్లి రాగా కనిష్టంగా క్వింటా రూ.517, గరిష్టంగా రూ.1329కు ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఆ వివరాలను మార్కెట్‌లోని ధరల బోర్డులోనూ ప్రదర్శించారు. అనంతరం మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కలెక్టర్ పి.రంజిత్ బాషా మార్కెట్‌లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. క్వింటా రూ.1200కు కొనుగోలు చేయడం లేదని రైతులు చెప్పడంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొంటుందని చెప్పారు. 1607 క్వింటాళ్లలో 82 క్వింటాళ్లను రూ.1329, 1525 క్వింటాళ్లను రూ.1200కు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు.

## వసుధ ఫార్మా డైరెక్టర్ అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)**

వసుధ ఫార్మా కంపెనీ డైరెక్టర్ మంతెన వెంకట సూర్య నాగవరప్రసాద్ రాజు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఉక్కు నగరంలోని ప్రగతి మైదాన్ సమీపంలో ఆయన మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. పక్కన పురుగుల డబ్బా ఉంది. వెంకట సూర్య నాగవరప్రసాద్ రాజు కూర్మన్నపాలెం పరిధి నక్షత్ర తోట ఏరియాలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చినప్పటి నుంచి ఆయన ముభావంగా ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఎవ్వరితోనూ మాట్లాడలేదని తెలిపారు. ద్విచక్ర వాహనం తీసుకొని సాయంత్రం బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదని చెప్పారు. సోమవారం ఉదయం తమ బంధువు ఒకరు ఫోన్‌లో మృతి సమాచారం తెలియజేశారని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

# తగ్గుముఖం పట్టిన గోదావరి

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- భద్రాచలం వద్ద ఉపసంహరణ
- ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు

పడవలపైనే రాకపోకలు సాగిస్తున్న అల్లూరి జిల్లా విఆర్.పురం మండలంలోని పలు గ్రామాల ప్రజలు

**ప్రజాశక్తి - యంత్రాంగం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శ్రీకాకుళం జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. లావేరు ఎంపిడిఒ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండుగంటలపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులపైకి నీరు చేరింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. విశాఖ జిల్లా భీమునిపట్నం, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

మూడు రోజులుగా భయపెట్టిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద ఆదివారం రాత్రి 48.10 అడుగులు ఉన్న నీటి మట్టం సోమవారం 42.05 అడుగులకు చేరింది. దీంతో రెండవ, మొదటి ప్రమాద హెచ్చరికలను అధికారులు ఉపసంహరించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఆదివారం రాత్రి నుంచి పెరుగుతూ వచ్చిన గోదావరి సోమవారం నాటికి స్థిరంగా ఉంది. ప్రస్తుతం అక్కడ 13.10 అడుగుల నీటి మట్టం నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ 175 గేట్లను ఎత్తి 11,79,236 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. సోమవారం రాత్రికి కాటన్ బ్యారేజీ వద్ద వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సోమవారం కలెక్టర్ సెలవు ప్రకటించారు. లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

**లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

శబరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలవరం ముంపు మండలాలైన కుక్కునూరు మండలంలో 12 గ్రామాలకు, వేలేరుపాడు మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో వశిష్ట గోదావరి ఉరకలేస్తోంది. కోడేరు వద్ద గోదావరి వరద ఉధృతి మరింత పెరిగింది. ఆచంట మండలంలో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏటిగట్టు దిగువన ఉన్న లంక భూములు ముంపునకు గురికావడంతో కూరగాయ, కొబ్బరి తోటలు నీట మునిగాయి. యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మిపాలెం, గంగడపాలెం, అబ్బిరాజు పాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాలను వరద నీరు చుట్టిముట్టింది. విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకల్లోని పలు గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. సుమారు 50 గ్రామాల రహదారులపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికే కొందరు గ్రామాలను విడిచి గుట్టలపైకి, పునరావాస కేంద్రాలకు చేరుకోగా అక్కడ వారిని సమస్యలు వేధిస్తున్నాయి. చింతూరు మండలంలో సోకులేరు వాగు ఉధృతి ఇంకా తగ్గలేదు. ఆంధ్ర - ఒడిశా రహదారి 326పై వరద నీరు ప్రవహిస్తుండడంతో రెండు రాష్ట్రాలకు రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. పలు గ్రామాలకు అధికారులు పడవలపైనే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

**శ్రీశైలం పది గేట్ల ద్వారా నీటి విడుదల**

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు జలాశయం పది గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 2,67,440 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 882.10 అడుగులుగా ఉంది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 199.7354 టిఎంసిలుగా నమోదయింది. ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో 3,42,398 కాగా అవుట్ ఫ్లో 3,28,125 క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

## మహిళల భద్రతపై వెనకడుగేయం : హోం మంత్రి అనిత

సభలో మాట్లాడుతున్న మంత్రి అనిత

**ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)**

చిన్నారులు, మహిళల భద్రతపై వెనకడుగు వేసేది లేదని, అయిఔత్యాలకు పాల్పడిన వారిని 24 గంటల్లోపు అరెస్టు చేయడంతో పాటు 3-6 నెలల్లో శిక్షలు పడేలా చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి అనిత అన్నారు. పల్నాడు జిల్లా పిడుగు రాళ్ల పట్టణంలోని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం స్త్రీ శక్తి మహాసభ నిర్వహించారు. సభలో మంత్రి అనిత మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం సెప్టెంబర్ 1న సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారని, అప్పటి నుండి రాష్ట్ర అభివృద్ధితో పాటు మహిళలు స్వయం శక్తితో ఎదగడానికి పాటుపడుతున్నారని, సామాన్య ఉపాధ్యాయురాలినైన తనను హోం మంత్రిని చేశారని అన్నారు. ఈగల్ టీం ఏర్పాటు ద్వారా గంజాయిని 99 శాతం నిర్మూలించామని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ శాఖతో పాటు వివిధ శాఖల్లో 20 లక్షల ఉద్యోగాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మిగులు బడ్జెట్‌తో అందించిన విద్యుత్ శాఖను గత ప్రభుత్వం నాశనం చేసిందని, ఇప్పుడు పడుతున్న భారాలన్నీ గత ప్రభుత్వ తప్పిదాలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి కె.శ్రీధర్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ఎన్.రాజకుమారి పాల్గొన్నారు.

## బెయిల్ పిటిషన్ వాపస్

**ప్రజాశక్తి-అమరావతి**

మద్యం కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను బూనేటి చాణక్య వెనక్కి తీసుకున్నారు. విజయవాడ ఎసిబి కోర్టులో పిటిషన్ వేసుకుంటానని హైకోర్టుకు చెప్పి వాపస్ తీసుకున్నారు.

పిటిషన్ ఉపసంహరణకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే చాణక్య పిటిషన్‌ను ఎసిబి కోర్టు కొట్టేసింది. తిరిగి హైకోర్టులో వ్యాజ్యం వేసినప్పటికీ ఎసిబి కోర్టులో దాఖలు చేసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన న్యాయవాది చెప్పారు.

## బెయిల్ షరతు సడలింపు

**ప్రజాశక్తి-అమరావతి**

అక్రమ మైనింగ్ అభియోగాల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గతంలో హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వుల్లోని కొన్ని షరతులను న్యాయమూర్తి జస్టిస్ యడ్లపల్లి లక్ష్మణ్‌రావు సడలించారు. నెల్లూరు జిల్లాలో ప్రవేశించరాదన్న షరతును ఎత్తివేశారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## మంచి రోజులొస్తాయి.. అధైర్యపడకండి

- ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం జగన్

**ప్రజాశక్తి-పులివెందుల టౌన్**

మంచి రోజులు వస్తాయని, ఎవరూ అధైర్య పడకుండా ఉండాలని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ సిఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో పులివెందుల చేరుకున్నారు. అనంతరం వైసిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి విజ్ఞప్తులను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి కూటమి నాయకుల దాడులకు భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. మంగళవారం ఉదయం తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్థంతి సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి ఇడుపులపాయకు చేరుకుని నివాళులర్పించనున్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 6న చలో విజయవాడ

- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యారంగలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదిన చలో విజయవాడ నిర్వహిస్తునట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి కె ప్రసన్నకుమార్ తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, విద్యార్థుల సమస్యలను, ఇచ్చిన హామీలను మాత్రం గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యార్థుల ఫీజులను కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని హామిఇచ్చినా ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు ఒక్క దఫా కూడా పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయలేదన్నారు. ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు విద్యార్థులకు తెగేసి చెబుతున్నాయని తెలిపారు. ఫీజుల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిజి ఎక్కడ చదువుతున్నా ఫీజులు చెల్లిస్తామని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జివో 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు నోరు మెదపడంలేదని పేర్కొన్నారు. వేలాది మంది విద్యార్థులకు పిజి చదువును కలగానే కూటమి ప్రభుత్వం మిగిల్చిందని విమర్శించారు.

సంక్షేమ వసతి గహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని ,హాస్టళ్ళలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3వేలకు పెంచాలని కోరారు. హాస్టళ్ళ అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న విసి, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేదిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు ఎమ్మెర్వో నుంచి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల ఉన్నతాధికారుల వరకూ పదేపదే విన్నవిస్తున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని తెలిపారు. అందువల్లే ఈ నెల 6వ తేదిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చెపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు పాల్గొని జయపద్రం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణిత, షణ్ముఖ్ జశ్వంత్ పాల్గొన్నారు.

# కౌలు రైతులకు రూ.2 లక్షల పంట రుణం

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు రూ.2 లక్షలకు తక్కువ కాకుండా హామీ లేని పంట రుణాలివ్వాలని ఎపి కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. విజయవాడలోని వన్‌టౌన్‌లో ఉన్న ఎస్‌ఎల్‌బిసి కార్యాలయం వద్ద సామూహిక రాయబారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగు భూమిలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేసి పంటలు పండిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో భూ యజమానులకు మాత్రమే బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. దీంతో కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ రాయితీతో కూడిన రుణ సౌకర్యం లేక ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడి ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి, పంట నష్టపోతే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. బ్యాంకులిచ్చే పంట రుణాల్లో కౌలు రైతులకు కనీసం 5 శాతం మేర ఇవ్వడం లేదన్నారు. అనేక చోట్ల బ్యాంకు మేనేజర్లను కౌలు రైతులు పంట రుణాలు అడిగితే డబుల్ ఫైనాన్స్ సాధ్యం కాదని చెబుతూ.. ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు తెలిపారు. ఆలయ భూములు సాగుచేస్తున్న కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలివ్వాలన్నారు. కౌలు రైతులకు 20 రోజులపాటు బ్యాంకులు పంట రుణాల మేళాను నిర్వహించాలని కోరారు. జిల్లా బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించి, రెవెన్యూ, వ్యవసాయశాఖలు, రైతు సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలని కోరారు. పంట రుణాల అమలుపై జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీని నియమించాలన్నారు. ఇ-క్రాప్‌లో నమోదైన కౌలు రైతులందరికీ పంట రుణాలివ్వాలన్నారు. అనంతరం కౌలు రైతులతో కలిసి ఎస్‌ఎల్‌బిసి జిఎం భాస్కరరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతులు.. పంట రుణాల మంజూరులో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఎల్‌బిసి జిఎం భాస్కరరావు మాట్లాడుతూ.. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల హామీ లేని పంట రుణాలు కౌలు రైతులకు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అన్ని బ్యాంకులకూ స్పష్టమైన ఆదేశాలు ఇస్తామన్నారు. సిసిఆర్‌సి కార్డులు లేకపోయినా జెఎల్‌జి గ్రూపులో ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు రూ.2 లక్షలు అందిస్తామన్నారు. రుణాల మంజూరులో ఏవైనా సమస్యలుంటే తక్షణమే తమ దృష్టికి తెస్తే సంబంధిత బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి రంగారావు, టివి లక్ష్మణస్వామి, ఎం రామాంజనేయుడు, సుధాకర్, టి సురేష్ బాబు, నాగమల్లేశ్వరరావు, కె ఏసుదాసు, బాపట్ల జిల్లా నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బిసి అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కౌలురైతు సంఘం నేతలు

## అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

**ప్రజాశక్తి-తాడిమర్రి**

గోపాల్ (ఫైల్)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలో దాడితోట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దాడితోట గ్రామానికి చెందిన తలారి గోపాల్ (37) మూడెకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేస్తూ, గొర్రెల పెంపకమూ కొనసాగిస్తున్నారు. పంట సాగు కోసం దాదాపు రూ.పది లక్షల వరకు అప్పులు చేశారు. ఆరు నెలల క్రితం గాలివాన బీభత్సంతో అరటి చెట్లు విరిగిపోయి పంట చేతికందకుండా పోయింది. చేసిన అప్పులు తీర్చడం కష్టమయ్యి తీవ్ర మనస్తాపానికి గురైన గోపాల్ సోమవారం తెల్లవారుజామున పిచికారి పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ఆయన మృతిచెందారు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు కావ్య, నక్షత్ర ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులకు అధికారుల బురిడీ నోటీసులు, బెదిరింపులు

- కరేడు భూసేకరణ భాగోతం

**ప్రజాశక్తి - కందుకూరు**

పాత తేదీలతో నోటీసులు జారీ చేస్తూ కరేడు రైతులను దగా చేసేందుకు భూసేకరణ అధికారులు ప్రయత్నిస్తున్నారు. కరేడు గ్రామ పంచాయతీలోని వాక ఆవాస రైతులకు గత శనివారం పోస్టల్ శాఖ ద్వారా నోటీసులందాయి. రాష్ట్ర మారిటైం బోర్డుకు చెందిన భూసేకరణ ప్రత్యేక కార్యాలయం (కావలి)కి చెందిన కార్యాలయం నుంచి కొందరు రైతులకు ఈ నోటీసులు వచ్చాయి. అధికారులు జారీ చేసిన నోటీసులపై తేదీ జూలై 14 అని ఉంది. భూసేకరణకు మీరు తెలిపిన అభ్యంతరాలపై భూమి పత్రాలు రుజువులతో సహా జూలై 30న ఉలవపాడు మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి వివరాలు సమర్పించాలని ఆ నోటీసుల్లో ప్రత్యేక ఉప కలెక్టర్ పేర్కొన్నారు. జులైలో పంపిన నోటీసులు ఆగస్టు 30న రైతులకు అందాయంటే అధికారుల ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదు. తమకు అందిన నోటీసులు తీసుకొని ఉలవపాడు మండల కార్యాలయానికి కరేడుకు చెందిన రైతులు కొందరు వెళ్లారు. వెళ్లిన రైతులను అధికారులు పరోక్షంగా బెదిరించారు. 'భూసేకరణకు మీరు ఎందుకు అంగీకరించడం లేదు, భూములు ఎందుకు ఇవ్వడం లేదు' అని బెదిరింపు ధోరణితో మాట్లాడారు. ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం మారిటైం బోర్డు ఉలవపాడు మండలం, కరేడులో 4,500 ఎకరాల భూసేకరణకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

## రామచంద్రయాదవ్‌ను కలిసిన కరేడు రైతులు

- అడుగడుగునా పోలీసుల అడ్డంకులు

**ప్రజాశక్తి - ఉలవపాడు (నెల్లూరు జిల్లా)**

కరేడు రైతులు, రామకృష్ణాపురం గిరిజనులు సోమవారం భారత చైతన్య యోజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్‌ను కలిసి ఉద్యమానికి ఊపిరి పోయాలని కోరారు. రామచంద్ర యాదవ్ విజయవాడ నుంచి పుంగనూరు వెళుతుండగా హైవేపై కలవాలని కరేడు రైతులు రామకృష్ణాపురం వీధుల్లో ప్రయత్నించగా అడుగడుగునా పోలీసులు వారికి అడ్డంకులు సృష్టించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా బిట్రగుంట జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు వద్ద రామచంద్ర యాదవ్‌ను కరేడు రైతులు కలిశారు. ఈ సందర్భంగా కరేడు ఉద్యమ రైతులు, గిరిజనుల కోరిక మేరకు రెండు మూడు రోజుల్లో వారి గ్రామానికి వస్తానని, వారి భూములు పోకుండా ఎంతటి పోరాటానికైనా, త్యాగానికైనా తాను సిద్ధంగా ఉన్నానని రామచంద్ర యాదవ్ మాటిచ్చారు. కరేడు గ్రామ ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ తమ భూములను విండో సోలార్ ప్రాజెక్ట్ వారికి ఇచ్చేలా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమని రైతు ఉద్యమ నాయకుడు, 139 బిసి కులాల జెఎసి రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో పోలీసు ఆంక్షలున్నాయని ప్రకాశం జిల్లాలో మాగుంట సుబ్బరామిరెడ్డి ఫ్యాక్టరీ వద్ద రామచంద్ర యాదవ్‌ను కలుద్దామని ప్రయత్నిస్తే నెల్లూరు, ప్రకాశం జిల్లాల పోలీసులు అడ్డగించి రైతులను రామచంద్ర యాదవ్ దగ్గరికి పోకుండా చేయాలని ప్రయత్నించగా నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని కలిసినట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు రైతుల ఘోష ఆలోచించి చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. ఉద్యమం మళ్లీ రాష్ట్రమంతా వ్యాపించేలా ప్రభుత్వం వ్యవహరించొద్దని శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## యూరియా కొరతపై 6న ఆందోళన

- సజ్జల, బొత్స, పెద్దిరెడ్డి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రైతులు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై ముఖ్యంగా యూరియా కొరతపై ఈ నెల 6న ఆందోళనలు నిర్వహించాలని, అన్ని ఆర్‌డిఒ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వైసిపి నాయకత్వంతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల పక్షాన సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు అన్ని విధాలా సాయం చేశారని తెలిపారు. టిడిపి కూటమిలో స్టాక్‌ను అధికార పార్టీకి చెందిన నాయకులు పక్కదారి పట్టించి రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతు విభాగంలో కమిటీలను త్వరగా పూర్తి చేయాలని, జిల్లాల్లో ఉన్న అన్ని అనుబంధ సంఘాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. వైఎస్‌ఆర్ వర్ధంతి రోజున అన్నిచోట్లా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ యూనిట్‌గా అందరూ కలిసి ఆందోళనలో పాల్గొనాలని తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్స్ లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపైనా పోరాడాలన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రైతులు అధిక రుణభారం బారినపడుతున్నారని, పంట చేతికొచ్చే సమయంలో వరదలు ఇబ్బంది పెడుతున్నాయని పేర్కొన్నారు. అలాగే కారుమూరి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ (రెడ్ సాండిల్ స్పెషల్) ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పకడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి నిందితునికి శిక్ష పడేలా చూశారు. నిందితుడైన తమిళనాడుకు చెందిన అన్బును తిరుపతి జిల్లా పెరుమాళ్ళ పల్లి బీట్ టిఎన్ పాలెం సెక్షన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. దీంతో ముద్దాయిని నెల్లూరు సెంట్రల్ జైలుకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్‌పి పి.శ్రీనివాస్ అన్నారు.

## పింఛను డబ్బులతో సచివాలయ లైన్‌మెన్ పరార్

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పరారైన ఉద్యోగి (ఫైల్)

వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం అందజేసే పింఛను డబ్బులతో సచివాలయ ఉద్యోగి పరారైన సంఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో సోమవారం చోటు చేసుకొంది. కురబలకోట ఎంపిడిఒ గంగయ్య తెలిపిన సమాచారం మేరకు.. అంగళ్లుకు చెందిన వెంకటేష్ కురబలకోట మండలంలోని తెట్టు సచివాలయంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా తెట్టు దళితవాడను వెంకటేష్‌కు అప్పగించారు. 80 మందికి పైగా లబ్ధిదారులకు రూ.4.90 లక్షల నగదును సోమవారం ఉదయం పంపిణీ చేయాల్సి ఉంది. డబ్బు తీసుకొన్న వెంకటేష్ పంపిణీ చేయకుండా పరారైనట్లు అధికారులు నిర్ధారించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చామని, తదుపరి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎంపిడిఒ చెప్పారు. లబ్ధిదారులకు పింఛను పంపిణీకి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న రాణిశర్మ, వేదికపై ఎంవిఎస్.శర్మ, చలసాని రాఘవేంద్రరావు తదితరులు

# లూలూకు భూ కేటాయింపు రద్దు

- విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక డిమాండ్
- సైన్స్ పార్కు నిర్మించాలని ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

విశాఖ సాగర తీరంలో లూలూకు 13.74 ఎకరాల ఖరీదైన ప్రభుత్వ భూమిని కేటాయించడాన్ని విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక తీవ్రంగా తప్పుబట్టింది. సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా వేదిక చైర్మన్ రాణి శర్మ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్తులకు, ఖజానాకు ధర్మకర్తగా ఉండాల్సిన ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత ఖరీదైన భూముల పందేరం చేపట్టడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ భూమిని ప్రజల ప్రయోజనాలకు మాత్రమే వినియోగించుకోవాలని హితవు పలికారు. లూలూకు భూమిని కేటాయిస్తూ ఇచ్చిన జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిపిఐ సీనియర్ నాయకులు చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ... టిడిపి కూటమి సర్కారు అధికారం చేపట్టిన తరువాత నగరంలోని ప్రభుత్వ భూములన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని విమర్శించారు. సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సాగర తీరంలోని భూమిని లూలూకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కార్పొరేట్లకు భూములు పంచిపెడితే చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రభుత్వ విధానాల వల్ల జరగబోయే నష్టాన్ని ప్రజానీకానికి వివరించి వారిలో చైతన్యం నింపి, ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రముఖ న్యాయవాది, కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, వేదిక కన్వీనర్ సిఎన్.క్షేత్రపాల్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎస్.వెంకటలక్ష్మి, పలు పౌర, ప్రజా సంఘాల, కార్మిక, మహిళ, యువజన, విద్యార్థి, దళిత సంఘాలు, వార్డు, నివాస్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. లూలూ మార్టుకు ఇచ్చిన అన్ని రకాల అనుమతులూ రద్దు చేయాలని, ఆ ప్రదేశంలో సైన్స్ పార్కు నిర్మించాలని ఏకగ్రీవ తీర్మానించారు. ఎం.మన్మధరావు, మణి, అష్రాఫ్, రాంబాబు, నాగభూషణం, అప్పారావు, బిబి.గణేష్, పిట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు కేసుల వల్ల ఫలితాలు ఆలస్యం

- త్వరలో 78 పోస్టులకు నోటిఫికేషన్
- 7 నుంచి ఫారెస్ట్ పోస్టుల పరీక్షలు
- ఎపిపిఎస్‌సి కార్యదర్శి పి రాజాబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన పరీక్షల ఫలితాలు కోర్టు కేసులు ఉండటం వల్ల ఆలస్యమవుతున్నాయని ఆ కమిషన్ కార్యదర్శి పి రాజాబాబు వెల్లడించారు. కోర్టు కేసులు పరిష్కారం కాగానే ఫలితాలను విడుదల చేస్తామని చెప్పారు. ఎపిపిఎస్‌సి కార్యాలయంలో సోమవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రూప్-1, 2 పోస్టులతోపాటు డిప్యూటీ ఇఒ, ఎఫ్‌ఆర్‌ఒ కోర్టు కేసుల వల్ల వీటి పరీక్షల ఫలితాలు విడుదల చేయలేదని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి పోస్టులపై అర్హతకు సంబంధించిన వివాదం పరిష్కారం కాగానే వీటి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు.

ఇప్పటి వరకు 1,600 పోస్టుల భర్తీకి కమిషన్ వివిధ నోటిఫికేషన్లను విడుదల చేసిందని తెలిపారు. ఈ నెలాఖరుకు వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి మరో 16 నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. పారదర్శకంగా వాల్యుయేషన్ పూర్తి చేసి ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ఈ నెల 7న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నామని చెప్పారు. అభ్యర్థులకు ఎబిసిడి సిరీస్‌లలో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసిన ప్రశ్నాపత్రం అందిస్తామని వెల్లడించారు. ఈ పరీక్షల్లో 1/3 నెగెటివ్ మార్కులు ఉన్నాయని, అభ్యర్థులు ఏవిధమైన పొరపాట్లు లేకుండా ఒఎంఆర్ షీట్‌ను పూర్తి చేయాలని కోరారు. తప్పులు చేస్తే ఒఎంఆర్ షీట్ చెల్లుబాటు కాదని తెలిపారు. ఒఎంఆర్ షీట్స్ పూర్తి చేయటానికి బ్లాక్ లేదా బ్లూ పెన్సును ఉపయోగించి మాత్రమే పూర్తి చేయాలన్నారు. ఎపిపిఎస్‌సిపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని, ఇది సరైంది కాదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ (హారిజాంటల్)కు సంబంధించి వివాదం వల్ల కొన్ని పోస్టుల ఫలితాలను ప్రకటించలేకపోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కమిషన్ అడిషనల్ సెక్రటరీ ఐఎన్ మూర్తి, జాయింట్ సెక్రటరీలు కెవి ప్రసాద్, జికె ప్రసూన పాల్గొన్నారు.

# తలసరి లెక్కలు 'డొల్లేనా'?

- చర్చనీయాంశమైన రిజర్వ్‌బ్యాంకు తాజా నివేదిక

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

రాష్ట్ర ప్రణాళిక శాఖ తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని, రానున్న కాలంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని చెబుతుండగా, తాజాగా రిజర్వ్ బ్యాంకు ప్రకటించిన ఒక నివేదికలో మాత్రం రాష్ట్ర పరిస్థితి మెరుగ్గా లేదని తేలిపోయింది. ప్రస్తుత ధరలు, నిలకడ ధరల గణాంకాల్లో అనేక చిన్న రాష్ట్రాల కన్నా కూడా ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉన్నట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుత ధరలు, నిలకడ ధరల ఆధారంగా పలు రాష్ట్రాల్లో ఉన్న తలసరి ఆదాయ వివరాలను ఆర్‌బిఐ తన నివేదికలో వెల్లడించింది. ఇందులో ప్రస్తుత ధరల జాబితాలో ఎపి ఏడో స్థానంలో ఉండగా, నిలకడ ధరల జాబితాలో ఏకంగా 13వ స్థానంలో కొనసాగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ తలసరిలో ఉత్తమ ర్యాంకులు నమోదు చేస్తుండగా, ఉత్తరాఖండ్, సిక్కిం, పుదుచ్చేరి, మిజోరామ్, అండమాన్ నికోబార్ వంటి చిన్న రాష్ట్రాలు కూడా మన రాష్ట్రం కన్నా మెరుగైన ర్యాంకుల్లోనే కొనసాగుతున్నట్లు తేలింది. ప్రస్తుత జాబితాలో ప్రస్తుత ధరలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ 2,65,240 రూపాయలతో ఏడో స్థానంలో ఉండగా, నిలకడ ధరల జాబితాలో 1,41,609 రూపాయలతో 13వ స్థానంలో కొనసాగుతోంది.ఇతర రాష్ట్రాల పరిస్థితి గమనిస్తే కరంట్ ధరల జాబితాలో కర్నాటక 3,80,906 రూపాయలతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పక్క రాష్ట్రమైన తెలంగాణ 3,79,751 రూపాయలతో రెండో స్థానంలో కొనసాగుతుండడం విశేషం. తమిళనాడు, హర్యానా, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు వరుసగా మూడు నుంచి ఆరో స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక కాన్‌స్టంట్ ధరల మేరకు సిక్కిం 2,92,339 రూపాయల తలసరితో అగ్రస్థానంలో ఉండగా, ఢిల్లీ 2,71,490 రూపాయలతో రెండో స్థానంలో ఉండగా, తరువాత స్థానాల్లో ఛండీఘర్, కర్నాటక, తమిళనాడు, హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి.

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని డిసిఎంఎస్ గోదాము వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

# గంటలో 400 కట్టల యూరియా ఖాళీ

- నిరాశతో వెనుదిరిగిన పలువురు రైతులు

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)**

యూరియా కోసం రైతులు ప్రాథమిక సహకార సొసైటీలు, డిసిఎంఎస్ గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జిడిఎంసి గోదాముకు ఆదివారం రాత్రి 400 యూరియా బస్తాలు రాగా సోమవారం ఉదయం 10 గంటలకు గోదామును తెరిచి విక్రయాలు ప్రారంభించారు. గంటలోనే సరుకంతా అయిపోయింది.

వందలాది మంది రైతులు యూరియా కోసం వచ్చినా అందరికీ దక్కలేదు. పాస్ పుస్తకం ఆధారంగా ఒక్కో రైతులకు గరిష్టంగా ఐదు బస్తాల వరకు యూరియా ఇస్తున్నారు. అయితే, అధికార పార్టీకి చెందిన వారు తమ ప్రాబల్యంతో ఒక్కొక్కరు 10 బస్తాల వరకూ తీసుకుంటున్నట్లు సమాచారం. కొంతమంది భూయజమానులే యూరియా బస్తాలు తెచ్చి కౌల్దార్లకు అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిసింది. మరోవైపు రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో యూరియా కావాలంటే యూరియా బస్తాతో పాటు లిక్విడ్ యూరియా డబ్బాలు, పురుగు మందు డబ్బాలు కూడా తీసుకోవాలనే ఆంక్షలు పెడుతున్నారని, దీనివల్ల తాము అదనంగా రూ.250 ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు దుకాణదారులు రూ.270 ధర ఉన్న యూరియా బస్తాను రూ.400 వరకూ విక్రయిస్తున్నారు. అదికూడా అందరికీ అమ్మకుండా తమకు తెలిసినా, ఫిర్యాదు చేయరు అని భావించిన నమ్మకస్తులకే అమ్ముతున్నారు.

**కృష్ణా జిల్లా :** గన్నవరం కో-ఆపరేటివ్ సొసైటీకి సోమవారం యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు వెళ్లి గంటల తరబడి లైన్లో నిలబడగా చివరకు సగం మంది రైతులు యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు. అధికారులు కేవలం 150 బస్తాలు మాత్రమే సొసైటీకి సరఫరా చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 75 మందికి మాత్రమే వచ్చాయి. 150 నుంచి 200 మంది రైతులు సొసైటీ వద్ద క్యూ కట్టారు.

### విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ

## 4న అఖిలపక్ష సమావేశం : సిపిఐ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 4న విశాఖపట్నంలో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశం వివరాలను రామకృష్ణ మీడియాకు వివరిస్తూ.. విశాఖ ఉక్కులో 42 విభాగాలను ప్రైవేటీకరించేందుకు యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) ప్రకటనను జారీ చేసిందన్నారు. ఈ నెల 10న 42 విభాగాలను ప్రైవేటుకు కేటాయించేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, డిఎపి, ఇతర ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. యూరియా కట్టకు రూ.100, డిఎపి కట్టకు రూ.200 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టి, రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని కార్యవర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఆపరేషన్ బుడమేరు విషయంలో ప్రభుత్వానికి చలనం లేకపోవడం విచారకరమన్నారు. వెంటనే ఆపరేషన్ బుడమేరును చేపట్టాలని కోరుతూ ఈ నెల 11న విజయవాడలో ధర్నా చేపట్టాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కుల గణన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కలిసొచ్చే రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, ఉప సంఘాలతో ఈ నెల 2వ వారంలో సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## డిప్యూటీ సిఎం పవన్‌తో విహెచ్‌పి నేతల భేటీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విహెచ్‌పి నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆలయాల నిర్వహణ, అభివృద్ధి, ధార్మిక ప్రచారం, సేవా కార్యక్రమాలపై చర్చించారు. భేటీలో విహెచ్‌పి ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ జనరల్ మిలింద్‌పరాండే, ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు, ఎపి, తెలంగాణ క్షేత్ర కార్యదర్శి టి సత్యరవికుమార్, రాష్ట్ర అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు, కోశాధికారి వి దుర్గా ప్రసాదరాజు ఉన్నారు.

## ఆపరేషన్ 'స్వర్ణ'

- స్వర్ణముఖి అక్రమ కట్టడాలు కూల్చివేత
- తిరుపతి చుట్టూ రింగ్‌రోడ్డు : తుడా చైర్మన్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో గత ప్రభుత్వం అక్రమ కట్టడాలు నిర్మించి పెద్దఎత్తున డబ్బులు గుంజుకుందని, వాటిని కూల్చేసేందుకు ఆపరేషన్ 'స్వర్ణ' ప్రారంభిస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడ) చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి చెప్పారు. తన వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలోని తుడా ఛాంబర్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు చంద్రగిరి మండలం తొండవాడ గ్రామం నుంచి స్వర్ణముఖి నది తిరుపతి, తిరుచానూరు, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి వరకు అక్రమ నిర్మాణాలను ఆపరేషన్ స్వర్ణ పేరుతో తొలగిస్తామని, డ్రోన్ సాయంతో సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తిస్తామని చెప్పారు. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొండవాడ గ్రామం ముక్కోటి వద్ద భూమి పూజ చేసి అక్కడి నుంచి ఆపరేషన్ స్వర్ణ చేపడతామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 550 కోట్లు తినేశారని, వైసిపి హయాంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి వ్యాపారం చేసుకున్నారని ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకోడానికి జూన్ 31 వరకు గడువు ఇచ్చామని చెప్పారు.

## బుడమేరును ప్రక్షాళన చేయాలి

- మాజీ మంత్రి వెలంపల్లి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

బుడమేరును ప్రక్షాళన చేసేదాకా ఊరుకోబోమని, నిర్లక్ష్యాన్ని వీడి చిత్తశుద్ధితో పనులు ప్రారంభించాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బుడమేరు విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే వైసిపి ఆందోళన చేస్తుందని అన్నారు. విజయవాడ బ్రాండ్‌ను కూటమి ప్రభుత్వం దెబ్బతీసిందని పేర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే వరదనీరు వచ్చి చేరుతోందని, కనీసం కాలువల పూడిక తీత కూడా తీయడం లేదని అన్నారు. నారాయణ.. సిఆర్‌డిఎకే మంత్రిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**వెన్నుపోటు సిఎం : సుధాకర్‌బాబు**

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం రాష్ట్రానికి చీకటి రోజుగా మిగిలిపోతుందని వైసిపి అధికార ప్రతినిధి టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. వెన్నుపోటుకు ప్రతీకగా రాష్ట్ర చరిత్రలో ఆ రోజు నిలిచిపోతుందని వివరించారు. ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటుతో పదవీచ్యుతుడిని చేసి అవమానించారని తెలిపారు. దీన్ని టిడిపి పండగలా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## 24 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- అక్టోబర్ ఒకటో తేదీన రథోత్సవం : టిటిడి

**ప్రజాశక్తి -తిరుమల**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఈ నెల 24 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్నట్లు టిటిడి పేర్కొంది. 23 సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24న ధ్వజారోహణం, 25న చిన్నశేషవాహనం, 26న సింహ వాహనం, 27న కల్పవృక్షం, 28న మోహినీ అవతారం, 29న హనుమంత, , అక్టోబర్ 1న రథోత్సవం, రెండున చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగయనున్నాయి. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టిటిడి పేర్కొంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్‌ఆర్‌ఐ, దాతల దర్శనాలు సైతం రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 27 రాత్రి తొమ్మిది గంటల నుంచి 29న ఉదయం ఆరు గంటల వరకు తిరుమల ఘాట్ రోడ్‌లో ద్విచక్ర వాహనాలను నిలిపివేయనున్నారు.

సంపాదకీయం

# బుడమేరు గోస

విజయవాడ నగరాన్ని బుడమేరు ముంచెత్తి ఏడాది. ఆ వరద బీభత్సం బెజవాడ, పరిసర ప్రాంత జనానికే కాదు రాష్ట్ర ప్రజల కళ్లల్లో ఇంకా మెదులుతూనే ఉంది. కాగా బుడమేరు ముంపు బారి నుంచి శాశ్వత చర్యలు చేపట్టే విషయంలో ప్రభుత్వ అలసత్వం అడుగడుగునా కనిపిస్తుంది. అప్పటికి తాత్కాలిక పనులతో మమ అనిపించి ప్రజలను గాలికి వదిలేయడం క్షమించరానిది. ప్రభుత్వ నిర్వాకం వలన ఒక మోస్తరు వర్షం పడినా విజయవాడ ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమనే దుస్థితి దాపురించింది. గతేడాది ఆగస్టు 31 రాత్రి బుడమేరు ఉప్పొంగి విజయవాడ మీద పడి నగరవాసులకు కాళరాత్రిని మిగిల్చింది. వరదలకు మూడు లక్షల మంది బాధితులయ్యారని, లక్ష వరకు ఇళ్లు మునిగిపోయాయని ప్రభుత్వమే ప్రకటించింది. మొదటి అంతస్థు వరకు నీళ్లొచ్చాయంటే వరద ఉధృతి అర్థమవుతుంది. ప్రజలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ప్రాణాలు కాపాడుకోవడమే గత్యంతరమైన దైన్యం. పదుల సంఖ్యలో చనిపోయారు. ఆనవాళ్లు దొరకని మరణాలు హృదయవిదారకం. హెలికాప్టర్లు, పడవలు, ఆహార పంపిణీకి డ్రోన్లు, ట్రాక్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. ఆస్తి నష్టం రూ.పది వేల కోట్లు కాగా, కేంద్రాన్ని 7 వేల కోట్లు అడిగామని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపడతామని హామీ ఇచ్చింది.

ఏడాదయ్యాక చూస్తే 'బుడమేరు' చర్యల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. నిరుడు వరదల సమయంలో తాత్కాలికంగా గండ్లు పూడ్చివేత మినహా ఒక్క శాశ్వత పనీ చేపట్టలేదు. ప్రతిపాదనల దశ దాటలేదు. బుడమేరు విజయవాడ మీద పడకుండా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు అండర్ టన్నెల్ వరకు కొత్తగా కాల్వ తవ్వుతామన్నారు. అక్కడి నుంచి ఉప్పుటేరు వరకు, ఉప్పుటేరు నుంచి సముద్రం వరకు వరద నీటిని పంపేందుకు నిర్మాణాలు, తవ్వకాలన్నారు. ఇప్పుడున్న డైవర్షన్ చానల్‌లో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. ఎనికేపాడు వద్ద అండర్ టన్నెల్ వెడల్పు అన్నారు. బుడమేరు పొడవునా ఇరువైపులా రక్షణ గోడలు కడతామన్నారు. వీటిలో ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా ఈ ప్రణాళికలు ముందుకెళతాయా? అన్ని విధాలా ఆదుకుంటామన్న కేంద్రం రూపాయి విదిల్చలేదు. కేంద్రాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం గట్టిగా అడగలేదు. వేలాది ఆక్రమణలను గుర్తించాం, హైదరాబాద్ హైడ్రా తరహాలో 'ఆపరేషన్ బుడమేరు' చేపడతామని బీరాలు పలికి చేతులెత్తేశారు.

కనీసం నాటి వరదల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు పరిహారం ఇవ్వడంలోనూ కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వేలాది మందికి నేటికీ అందలేదు. సహాయం కోసం బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ధర్నాల వంటి ఆందోళనలతో రోడ్డెక్కుతున్నా ప్రభుత్వంలో చలనం లేదు. ఎన్యూమరేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తులని అప్పటికి బాధితులను చల్లబర్చింది. వరదతో పాడైపోయిన వేలాది ఆటోలు, కార్లు, బైక్‌లకు ఇన్సూరెన్స్‌లు ఇప్పిస్తామన్న ప్రభుత్వం మొదట్లో కొంత హడావుడి చేయగా కంపెనీలు నిబంధనలను అడ్డం పెట్టడంతో కేంద్రంతో మాట్లాడతామంది. కేంద్రం స్పందించకపోవడంతో ఆ అంశాన్ని అక్కడితో వదిలేసి బాధితుల కష్టాలు బాధితులే పడాలంది. విజయవాడ దు:ఖదాయనిగా పేరు గాంచిన బుడమేరు సమస్య దశాబ్దాలనాటిది. నిరుడు కనీవిని ఎరగని వరదలను విజయవాడ ప్రజలు అనుభవించారు. విజయవాడ మునగడమంటే రాజధాని మునగడంగా భావిస్తారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఆ స్థాయి ప్రాధాన్యత విజయవాడ వరదలకు ఇవ్వలేదని నాటి హామీల ఉల్లంఘన బట్టి అర్థమవుతుంది. వరద తగ్గే వరకు కలెక్టర్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి బస, పడవలు బస్సులు, ట్రాక్టర్లలో పర్యటనలు, అధునాతనంగా డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ వంటివి ప్రచారానికి బాగా పనికొస్తాయి. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపడితేనే బెజవాడ ప్రజలకు రక్షణ. రాజధాని ప్రాంత అభివృద్ధికి నిజమైన సార్ధకత.

మంచి మాట



**బూర్జువా వర్గం తనను ఖతం చేసే ఆయుధాలను మాత్రమే సృష్టించలేదు. ఆ ఆయుధాలను పట్టుకోగలిగిన మనుషుల్ని కూడా పుట్టించింది. వారే శ్రామికులు. ఆ వర్గమే ఆధునిక కార్మిక వర్గం.**

**- కారల్ మార్క్స్, ఏంగెల్స్**

**కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక.**

# స్థిరత్వంగల పెట్టుబడిదారీ వ్యవస్థ - ఒక అభూత కల్పన

ప్రత్యామ్నాయం

తన 'అత్యాచారాలను' సరిదిద్దుకోడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ 'స్థిరంగా' కొనసాగగలదని, అందువలన దాని ఉనికికి సమాజం నుండి ఏ సవాలూ ఎదురయ్యే పరిస్థితి తలెత్తకుండా చేయవచ్చునని ఆర్థికవేత్తలలో ఒక అభిప్రాయం ఎప్పుడూ కొనసాగుతూనే వుంది. ఐతే ఈ అభిప్రాయం మార్క్సిస్టు అవగాహనకు పూర్తిగా భిన్నమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థ లోని 'అత్యాచారాలకు' ముగింపు ఆ పెట్టుబడిదారీ వ్యవస్థను దాటి కొత్త వ్యవస్థను నిర్మించుకోవడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని మార్క్సిస్టులు భావిస్తారు. సరిదిద్దబడి, ఆ కారణంగా 'స్థిరంగా కొనసాగే' పెట్టుబడిదారీ వ్యవస్థ అనే ఒక ఊహాజనిత విచిత్ర జంతువును మనకు చూపిస్తూనే వున్నారు. అది కేవలం ఊహాజనితమే అన్నది పదే పదే స్పష్టం ఔతున్నప్పటికీ ఆ విచిత్ర జంతువు చిత్రాన్నే మార్చి మార్చి మళ్ళీ మళ్ళీ చూపిస్తున్నారు.

ఇంగ్లీషు ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఈ 'అత్యాచారం' భారీ స్థాయిలో పనుల్లోంచి తొలగించబడడంతో కలిగే నిరుద్యోగం రూపంలో ఈ వ్యవస్థలో అన్ని వేళలా కొనసాగుతూ వుండడమేనని భావించాడు. ఆర్థిక మాంద్యం సమయంలో ఈ నిరుద్యోగం పలు రెట్లు పెరుగుతుందని, కాని తక్కిన సాధారణ సమయాల్లో కూడా అది కొనసాగుతుందని గమనించాడు. దీనిని సరిదిద్దడానికి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలోని డిమాండ్‌ను (కొనుగోలు శక్తిని) మరింత పెంచడం కోసం జోక్యం చేసుకోవాలని అతడు ప్రతిపాదించాడు. ఆ తర్వాత కీన్స్ సూచించిన మార్గంలోనే ప్రభుత్వం జోక్యం చేసుకుని వ్యవస్థను 'సరిదిద్దినట్టు' అందరూ భావించారు. కాని దానితో పెట్టుబడిదారీ వ్యవస్థ సరిదిద్దబడలేదు సరికదా మళ్ళీ గణనీయంగా నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ కొత్త పరిస్థితుల్లో ఇక ప్రభుత్వం జోక్యం కల్పించుకోగలిగినది కూడా స్వల్పమే.

ప్రభాత్ పట్నాయక్

ఇక మూడవ ప్రపంచపు దేశాల సమాజాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి భారీ మోతాదులో పేదరికం పెరుగుదలకు దారి తీసింది. అత్యధికులకు సమాజంలోని వనరులు (పెట్టుబడి) అందుబాటులో లేకుండా పోయిన ఈ పరిస్థితిని సరిదిద్దడానికి, ఇంకా చెప్పాలంటే వారికి ఎక్కువ వనరులను అందుబాటులోకి తేవడానికి, మైక్రో రుణాలను అందించడం పరిష్కారం అని ప్రతిపాదించారు. అప్పుడు ఈ వ్యవస్థను కూలదోయవలసిన అవసరం తలెత్తదని వాళ్ళు చెప్పారు. ఈ భావనను బాగా ఉత్సాహంగా ముందుకు తెచ్చినది ప్రపంచ బ్యాంక్. వెనకబడ్డ కుటుంబాలు పేదరికాన్ని అధిగమించడానికి కావలసిన పెట్టుబడులు వారిని కొల్లగొట్టని రీతిలో (అధిక వడ్డీల రూపంలో) మామూలుగా లభించడం లేదని, అందుకనే వారు తమ జీవన పరిస్థితులను మెరుగు పరుచుకోలేక పోతున్నారని ప్రపంచ బ్యాంక్ చెప్పింది. ఎవరికి వారు కుటీర స్థాయి సంస్థలను ఏర్పాటు చేసుకోడానికి వీలుగా స్వయం-సహాయ బృందాలుగా ఏర్పడాలని సూచించింది. ఆ బృందాలకు తేలికగా ఉండే నిబంధనలపై సంస్థాగత రుణాలను అందించవచ్చునని, అప్పుడు ఆ బృందాలలోని పేదలు చొరవ తీసుకోగలుగుతారని, చిన్న చిన్న వ్యాపారాలను స్థానికంగా ప్రారంభించి పేదరికం నుండి బైట పడగలుగుతారని చెప్పింది.

> లాభం వచ్చే అవకాశం ఉందన్న వాసన పట్టగానే, అది బడా ఫైనాన్స్ రంగం కానీయండి, మిలిటరీ పరికరాల ఉత్పత్తి రంగం కానీయండి లేదా మరేదైనా రంగం కానీయండి, దేనినీ పెట్టుబడిదారీ వ్యవస్థ విడిచిపెట్టదు. ఆఖరికి తనను కాపాడేందుకు ప్రవేశించిన మైక్రో ఫైనాన్స్ రంగాన్ని సైతం అది విడిచిపెట్టదు.

ఈ ప్రపంచ బ్యాంక్ ప్రతిపాదనలో కొట్టొచ్చినట్టు కనిపించే లోపం ఒకటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తమయ్యే అరాచక ధోరణులను అదుపు చేయడానికి ప్రభుత్వ జోక్యం పెరగాలని ఎక్కడా ఆ ప్రతిపాదనలో లేదు. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా సంస్థాగత రుణాలమీద అంతవరకూ గుత్త సంస్థలకు మాత్రమే ఉన్న అవకాశాలకు కోతపెట్టి కొంతవరకూ వ్యవసాయానికి, చిన్న చిన్న వ్యాపారులకు మళ్ళించారు. ఆ విధమైన ప్రభుత్వ జోక్యం వలన పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న అరాచక పద్ధతి, పెట్టుబడి కేంద్రీకరణ కొంతవరకు వెనక్కి తగ్గాయి.

మైక్రో రుణాల గురించి ప్రపంచబ్యాంక్ చేసిన ప్రతిపాదనలో బ్యాంకుల జాతీయీకరణ వంటిది కాని, వేరే ఇతరత్రా పద్ధతుల ద్వారా గాని ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఎక్కడా లేదు. మైక్రో రుణాల ద్వారా ఇప్పుడున్న పెట్టుబదారీ చట్రం లోపలే పేదరికం, నిరుద్యోగం అంతరిస్తాయని ప్రపంచబ్యాంక్ భావించింది (నిజానికి ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల దృష్టిలో పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎటువంటి అరాచక ధోరణులూ వుండనే వుండవు). అందుచేత ప్రపంచబ్యాంక్ ఈ ప్రతిపాదన ద్వారా "గాదిలో ధాన్యం గాదిలోనే వుండాలి కాని బిడ్డలు మాత్రం కుంచాల్లా గుండ్రంగా ఎదిగిపోవాలి" అన్న చందాన ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ మాత్రం యథాతథంగానే చెక్కు చెదరకుండా ఉండాలి కాని పేదరికాన్ని మాత్రం లేకుండా చేయాలి అని వాళ్ళు కోరుకుంటున్నారు. అది కూడా ఇంతవరకూ నిరుద్యోగులుగా ఉన్నవారికి పెట్టుబడిదారీ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడం ద్వారా కాదు, ఆ పేదలే మైక్రో రుణాల ద్వారా వారి పేదరికాన్ని వారే అధిగమించేయాలి!

కాని అన్ని చోట్లా కలిగిన అనుభవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఎక్కడైనా మైక్రో సంస్థలు పేదవారికి తోడ్పడగలిగాయి అంటే అక్కడల్లా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వల్లే తప్ప పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ నియంత్రణా లేకుండా విచ్చలవిడిగా విడిచిపెట్టడం వలన కాదు. ఈ సందర్భంలో మనకు కేరళ లోని కుటుంబశ్రీ పథకం ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుంది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సహకార సంస్థలు ఏర్పడి పలు రకాల ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనగలిగాయి. ఐతే, ఆ మాదిరిగా ప్రభుత్వ జోక్యం అనేది ఏదీ లేకుండానే మైక్రో రుణాల ద్వారా ఏర్పడే చిన్న చిన్న సంస్థలు పేదరికాన్ని నిర్మూలిస్తాయని ప్రపంచబ్యాంక్ ప్రచారం చేస్తోంది. ఆ పాటనే కొందరు ఆర్థిక నిపుణులు కూడా అందుకున్నారు. పెట్టుబడిదారుల మీద మాత్రం ఎటువంటి అదుపూ ఉండదు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 9000 మంది మహిళలను సర్వే చేసి వారి మైక్రో రుణాల అనుభవాలు ఏవిధంగా ఉన్నాయో బహిరంగ విచారణ ద్వారా వారినే సాక్షులుగా పిలిచి వివరించమని కోరింది. ఈ ఏడాది ఆగస్టు 23, 24 తేదీలో ఆ విచారణ న్యూ ఢిల్లీలో జరిగింది. ఆ విచారణలో వెల్లడైన విషయాలు:

> ఒక ధృవం దగ్గర సంపదను, రెండో ధృవం దగ్గర పేదరికాన్ని అనునిత్యమూ సృష్టించే సహజ స్వభావం ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను సరిదిద్ది, అది స్థిరంగా కొనసాగేట్టు చేయవచ్చునని అనుకోవడం కేవలం కల్పన మాత్రమే. మైక్రో ఫైనాన్స్ వంటి ఎన్ని వ్యవస్థలను రంగం మీదకు తెచ్చి వాటి ద్వారా ఈ వ్యవస్థకు 'స్థిరత్వం' తీసుకురావాలని ప్రయత్నించినా, వాటన్నింటినీ భ్రమాన్వితంగా మార్చివేసేది ఈ పెట్టుబడిదారీ వ్యవస్థే.

**మొదటిది:** ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి బ్యాంకులతో సహా అన్ని వాణిజ్య బ్యాంకులూ ఏ పూచీకత్తులు, డాక్యుమెంట్లు, లేకుండా రుణాలు ఇచ్చేందుకు సిద్ధపడలేదు. అటువంటి పూచీకత్తులను గాని డాక్యుమెంట్లను గాని సమర్పించడం పేద మహిళలకు అసాధ్యమైన పని. అందుచేత పేద కుటుంబాలలోని మహిళలు దాదాపు ఈ సంస్థల నుండి రుణాలను పొందలేక దూరంగానే ఉండిపోవలసి వచ్చింది.

**రెండవది:** ఇవే బ్యాంకులు పెట్టుబడిదారుల పెత్తనంలో ఉండే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలకు, మైక్రో ఫైనాన్స్ సంస్థలకు రుణాలను ఇచ్చాయి. ఈ సంస్థలు మధ్యవర్తులుగా వ్యవహరించాయి. ఇవి బ్యాంకుల నుండి తక్కువ వడ్డీలకు రుణాలు తీసుకున్నాయి. వాటిని పేద లబ్ధిదారులకు అత్యధిక రేటు వడ్డీలకు (అంటే 21 నుండి 26 శాతం దాకా) రుణాలుగా ఇచ్చాయి. అంతకన్నా ఘోరం ఏమంటే, ఈ విధంగా నాన్ బ్యాంకింగ్ సంస్థలకు మైక్రో ఫైనాన్స్ సంస్థలకు రుణాలు ఇవ్వడాన్ని వాణిజ్య బ్యాంకులు ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణించడం !

**మూడవది:** ఈ నాన్ బ్యాంకింగ్ సంస్థలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు ముందు రుణాలను సులువుగా అందిస్తున్నట్టు వ్యవహరించి పెద్దగా డాక్యుమెంట్ల గురించి పట్టుబట్టకుండానే, ఆధార్ కార్డు వంటి డాక్యుమెంట్ల ఆధారంగానే రుణాలు ఇచ్చాయి. ఒకసారి రుణం తీసుకున్నాక, ఆ తర్వాత నెలవారీ వాయిదాలను చెల్లించమని ఆ మహిళలను వేధించడం, వారిని నీచంగా మాట్లాడడం, కొన్ని సందర్భాలలో భౌతిక దాడులకు దిగడం కూడా చేస్తున్నాయి.

**నాలుగవది:** పిల్లల చదువుకయ్యే డబ్బును సమకూర్చుకోవడం కోసమో, ఉన్నట్టుండి జబ్బు పడితే వైద్యానికయ్యే ఖర్చును భరించడం కోసమో ఎక్కువమంది మహిళలు రుణాలు తీసుకున్నారు. ఇటువంటి ఖర్చుల వలన సమీప భవిష్యత్తులో వారి ఆదాయాలు పెరిగే అవకాశం కనిపించదు. అప్పుడు ఆ అప్పును తిరిగి తీర్చడం కష్టం ఔతుంది. దానికి తోడు చాలా దారుణంగా ఉన్న వడ్డీ రేట్ల వలన ఆ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. దీని ఫలితంగా రుణగ్రహీతలు వేరు వేరు సంస్థల నుండి రుణాలను చాలా ఎక్కువ వడ్డీలకు తీసుకోవలసి వస్తోంది. అంతకు ముందు తీసుకున్న అప్పును చెల్లు వేయడానికి కొత్త అప్పు తీసుకుంటున్నారు. ఈ విధంగా వారు ఒక పెద్ద అప్పుల ఊబిలోకి దిగబడిపోతున్నారు. దానినుండి బైటపడే మార్గం ఏదీ వారికి కనిపించడం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో మైక్రో రుణాలు పేదరికం నుండి విముక్తి పొందడానికి దారి చూపుతాయని ప్రపంచ బ్యాంక్ చెప్పినది కాస్తా వారిని మరింత పేదరికం లోకి నెట్టే సాధనాలుగా మారిపోయాయి.

పేదరికాన్ని తొలగించేబదులు, వారిని మరింత పేదరికంలోకి నెట్టే ఈ వైపరీత్యం వాస్తవానికి పెట్టుబడిదారీ వ్యవస్థ నడక లోనే నిబిడీకృతమై వుంది. ఇలా పేదరికాన్ని తగ్గించే బదులు మరింత పెంచేవిధంగా మైక్రో రుణాలు పని చేయడం రెండు విధాలుగా ఉంటుంది. మొదటిది: పెట్టుబడిదారీ వ్యవస్థ పనిలో స్థూల ఆర్థిక పర్యవసానాలు పలు రూపాల్లో కనిపిస్తాయి. విద్య, వైద్యం వంటి సేవలను ప్రైవేటీకరించడం, దాని ఫలితంగా ఆ సేవలు మరింత ఎక్కువ ఖరీదు కావడం, దాని ఫలితంగా ఆ సేవలను పొందడానికి అప్పులు చేయవలసిరావడం, ఆ అప్పులను తీర్చలేక పోవడం-ఇదంతా ఒక పక్కన జరుగుతూ వుంటుంది. మరో పక్క వినిమయ సరుకుల ఉత్పత్తి రంగాలలో ఏర్పడిన మాంద్యం (ఇటువంటి మాంద్యాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా ఏర్పడతాయి) ఉపాధి అవకాశాలను తగ్గించి వేస్తుంది. దాని ఫలితంగా ఆదాయాలు తగ్గుతాయి. అప్పుడు వారు అప్పులు చేయవలసి వస్తుంది. ఇది పేదలు అప్పుల ఊబిలో దిగబడిపోవడానికి రెండో దారి. అందుచేత పేదలను పేదరికం నుండి విముక్తి చేయడానికి రంగ ప్రవేశం చేసిన మైక్రో రుణ వ్యవస్థ ఈ పెట్టుబడిదారీ చట్రం లోపల ఇరుక్కుని దాని అసలు లక్ష్యం నుండి దారి తప్పుతుంది. ఎందుకంటే సూక్ష్మ (మైక్రో) స్థాయిలో పని చేసే ఈ రుణ విధానం స్థూల (మాక్రో) స్థాయిలోపైన వ్యక్తం ఔతున్న ధోరణులను అడ్డుకోలేదు ( అంటే విద్య, వైద్యం వంటి సేవల ప్రైవేటీకరణ వంటి ధోరణులను).

పేదరికాన్ని తొలగించి ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను స్థిరంగా కొనసాగేట్టు చేయడానికి రంగంలోకి వచ్చిన ఈ మైక్రో రుణ వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థ విడిచిపెట్టదు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ రంగంలో లాభం వచ్చే అవకాశం ఉంటుందో దానిని వెతుక్కుంటూ, దాని వాసన పట్టుకోడానికి నిరంతరం ప్రయత్నిస్తూ వుంటుంది. ఇప్పుడు మైక్రో రుణ వ్యవస్థ పేద మహిళలకు తక్కువ వడ్డీలకు రుణాలివ్వడానికి వచ్చింది. కాని ఆ చౌక వడ్డీలను పెట్టుబడిదారులు నడిపే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు కాజేస్తాయి. ఆ ధనాన్నే పేదలకు రుణాలుగా ఇచ్చి అధిక వడ్డీలను గుంజుతాయి.

లాభం వచ్చే అవకాశం ఉందన్న వాసన పట్టగానే, అది బడా ఫైనాన్స్ రంగం కానీయండి, మిలిటరీ పరికరాల ఉత్పత్తి రంగం కానీయండి లేదా మరేదైనా రంగం కానీయండి, దేనినీ పెట్టుబడిదారీ వ్యవస్థ విడిచిపెట్టదు. ఆఖరికి తనను కాపాడేందుకు ప్రవేశించిన మైక్రో ఫైనాన్స్ రంగాన్ని సైతం అది విడిచిపెట్టదు.

ఒక ధృవం దగ్గర సంపదను, రెండో ధృవం దగ్గర పేదరికాన్ని అనునిత్యమూ సృష్టించే సహజ స్వభావం ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను సరిదిద్ది, అది స్థిరంగా కొనసాగేట్టు చేయవచ్చునని అనుకోవడం కేవలం కల్పన మాత్రమే. మైక్రో ఫైనాన్స్ వంటి ఎన్ని వ్యవస్థలను రంగం మీదకు తెచ్చి వాటి ద్వారా ఈ వ్యవస్థకు 'స్థిరత్వం' తీసుకురావాలని ప్రయత్నించినా, వాటన్నింటినీ భ్రమాన్వితంగా మార్చివేసేది ఈ పెట్టుబడిదారీ వ్యవస్థే.

**(స్వేచ్ఛానుసరణ)**

# తల వంచే తరం కాదు-తల ఎత్తే తరం కావాలి

విశ్లేషణ

ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరయ్యాను. విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పిల్లల వ్యక్తిత్వ వికాసంపై చర్చించగలగడం అభినందనీయం. కానీ అదే వేదికపై చోటు చేసుకున్న ఒక ప్రక్రియ నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది.

పిల్లలను తల్లిదండ్రుల పాదాలకు మొక్కించటం, పాదాలు ముద్దాడమని చెప్పటం కనిపించింది. అది స్వచ్ఛందంగా జరగలేదు. అది ఆ చిన్నారుల మొహాలలో స్పష్టంగా కనిపించింది. దక్షిణ భారత సంస్కృతిలో ఇది అనూహ్యం. బెంగాల్ వంటి ఉత్తర భారత ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలలో ఉండే సంప్రదాయాన్ని, మన సమాజంలో బలవంతంగా ప్రవేశపెట్టడమా? అనిపించింది. అంతే కాదు, ఉపాధ్యాయులకు పాదాభివందనం చేయించడాన్ని కూడా చూశాను. ఇవన్నీ కలిపి చూస్తే, విద్యా వ్యవస్థను అర్థం చేసుకునే మార్గాన్ని, దాని లక్ష్యాన్ని తిరస్కరించే సంకేతంగా అనిపించింది. ఇది మన పిల్లలపై విధేయతను రుద్దే ప్రయత్నంగా పురాతన సంస్కృతికే తిరిగిపోతున్న సంకేతంగా అనిపించింది.

డా॥ కె. రమాప్రభ

### గౌరవం అనేది ఒక భావం

గౌరవం అనేది హృదయంలోని భావం. కేవలం శారీరక చర్యలలో లేదా బాహ్య ఉపచారాలలో ఉండదు. ఒక విద్యార్థి తన గురువును లేదా తల్లిదండ్రులను గౌరవించడానికి పాదాభివందనం చేయవలసిన అవసరం లేదు. గౌరవం అనేది వారి సలహాలను ఆదరించడం, వారి నుండి నేర్చుకోవడం, వారి బోధనలను జీవితంలో ఆచరించడం ద్వారా వ్యక్తమవుతుంది. ఆధునిక సమాజంలో, గౌరవం బాహ్య చర్యలకు పరిమితం కాకుండా, ఆలోచనలు, చర్యలు, సమానత్వ భావనల ద్వారా వ్యక్తమవ్వాలి.

### సమ న్యాయానికి నిలబడే పౌరులే అవసరం

ఆధునిక విద్యా వ్యవస్థ లక్ష్యం కేవలం అక్షరాస్యతను అందించడం మాత్రమే కాదు, సమాజంలో న్యాయం, సమానత్వం, పురోగతిని సాధించగల పౌరులను తయారు చేయడం. నిలబడి మాట్లాడే విద్యార్థులు అన్యాయాన్ని ఎదిరించగలరు. సామాజిక సమస్యలపై తమ గొంతును వినిపించగలరు. సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగలరు. సామాజిక సంస్కర్తలైన రాజా రామ్మోహన్ రాయ్, జ్యోతిబా పూలే వంటి వారు అంధ విధేయతకు లొంగకుండా, సమాజంలో మార్పు తీసుకువచ్చారు.

### పిల్లల అభివృద్ధికి స్వేచ్ఛ, సంభాషణ ముఖ్యం

పిల్లల మానసిక, బౌద్ధిక అభివృద్ధికి స్వేచ్ఛ, సంభాషణ అత్యంత కీలకం. విద్యార్థులు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం, ప్రశ్నలు అడగడం, చర్చలలో పాల్గొనడం ద్వారా వారి వ్యక్తిత్వం బలపడుతుంది. గురువులు, తల్లిదండ్రులు విద్యార్థులతో సంభాషణను ప్రోత్సహించాలి, వారి ఆలోచనలను గౌరవించాలి. ఇది విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది.

### పాదపూజలు భయం ఆధారంగా ఏర్పడతాయి

పాద పూజలు, తల వంచడం వంటి ఆచారాలు కొన్ని సందర్భాలలో భయం లేదా సామాజిక ఒత్తిడి ఆధారంగా జరుగుతాయి. పిల్లలు తాము తక్కువవారు, పెద్దవారు అత్యంత శక్తివంతులు అనే భావన పెరుగుతుంది. ఇది వారి అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. భయం ఆధారిత సంబంధం తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ ప్రేమకు ప్రతిరూపాలుగా కాకుండా, శాసించే అధికారులుగా కనిపించటం ప్రారంభమవుతుంది. విమర్శనాత్మక ఆలోచనకు అడ్డుపడటం వల్ల పిల్లలు ఏ విషయాన్నైనా ప్రశ్నించే ధైర్యం కోల్పోతారు. "పెద్దవారు చెప్పిందే నిజం" అనే అభిప్రాయం అలవాటవుతుంది. ఇవి నిజమైన గౌరవం లేదా ప్రేమను సూచించక పోవచ్చు. నిజమైన గౌరవం అనేది పరస్పర అవగాహన, ప్రేమ, ఆదరణ ద్వారా వ్యక్తమవుతుంది. విద్యార్థులు భయం కారణంగా కాకుండా,

> 'పిల్లలకు తల వంచే శిక్షణ కంటే, నిలబడి మాట్లాడే శక్తి కావాలి. పాఠశాలలు పిల్లల చేత పాదపూజలు చేయించే కార్యక్రమాలను నిలిపివేయాలి. తల్లిదండ్రులపై ప్రేమను వ్యక్తీకరించాలంటే-మాటల్లో, చేతల్లో, మనసులో చూపాలి-తల వంచే శరీర చర్యల ద్వారా కాదు'.

ప్రేమ - గౌరవ భావనతో తమ గురువులను, తల్లిదండ్రులను ఆదరించాలి. ఈ విధమైన గౌరవం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయదు, బదులుగా వారిని బలోపేతం చేస్తుంది.

సంప్రదాయాలపై ఆధారపడి అధిపత్యాన్ని కొనసాగించాలనే యత్నం ఇప్పటి రాజకీయ వర్గాల్లో పాత విలువలు, గురుకుల పద్ధతులు, ధార్మిక విశ్వాసాలు అనే పేర్లతో ఆధిపత్య నిర్మాణాలను తిరిగి బలపరచే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం సంస్కృతి పరిరక్షణ కాదు, అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నం. ప్రశ్నించే పిల్లలు బదులుగా విధేయత చూపే తరం కావాలన్న లక్ష్యం ప్రస్తుతం విద్యా విధానంలో పిల్లలు నిశ్శబ్దంగా ఉండాలని, ఉపాధ్యాయుడి మాటే శాసనంగా తీసుకోవాలని సూచించే మార్గాలు పెరిగాయి. ఇది కొత్త తరం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచనను అణిచివేస్తుంది. అలాంటి తరం ప్రభుత్వాన్ని ప్రశ్నించదు, సమాజపు తేడాలను ఎత్తి చూపదు, నియంత్రణను అంగీకరిస్తుంది. ఇది ఒక విధమైన సామాజిక మౌనాన్ని బలపరచే విధానం. భారతదేశంలో పాలక వర్గాలు, రాజకీయ శక్తులు "సంస్కృతి" అనే పదాన్ని బలంగా వాడుతున్నాయి. ఇది నిజంగా ప్రజల జీవన విధానాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో కాకుండా, ప్రాచీన సంప్రదాయాల పేరుతో కుల ఆధారిత, అధికార వర్గాలకు అనుకూలమైన విలువలను తిరిగి తీసుకురావాలన్న ప్రయత్నంగా మారుతోంది.

నూతన జాతీయ విద్యా విధానంలో 'గురుకుల పద్ధతి'కి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రాచీన సంస్కృత గ్రంథాలపై దృష్టి పెట్టి భారతీయతను నినాదంగా మార్చడం చూస్తుంటే...జ్ఞానం పెద్దవారి వద్ద ఉండాలి, పిల్లలు వినాలనే పద్ధతికి దారితీసేలా వుంది. ఇది సమానత్వాన్ని అంగీకరించని బ్యాంకింగ్ మోడల్ విద్యను ప్రోత్సహిస్తుంది.

### ఈ చర్యల వెనక దాగిన భావజాలాన్ని ప్రశ్నించాలి

ఈ విధమైన చర్యలు "సంస్కృతి", "గౌరవం", "ధర్మం" అనే పేర్లతో సమాజంలో అమలవుతున్నప్పటికీ, దీని వెనుక ఉన్న అసలైన ఉద్దేశం ఏమిటి? అధికారాన్ని, అధిపత్యాన్ని కొనసాగించాలనే ప్రయత్నమా? పిల్లల ఆలోచనా స్వేచ్ఛపై పట్టు సాధించాలన్న లక్ష్యమా? సమానత్వాన్ని భయపెట్టే తత్వాలతో తుడిచేయాలన్న సంకల్పమా? ఈ ప్రశ్నలు సమాజం మొత్తం చర్చించాల్సినవి. 'పిల్లలకు తల వంచే శిక్షణ కంటే, నిలబడి మాట్లాడే శక్తి కావాలి. పాఠశాలలు పిల్లల చేత పాదపూజలు చేయించే కార్యక్రమాలను నిలిపివేయాలి. తల్లిదండ్రులపై ప్రేమను వ్యక్తీకరించాలంటే-మాటల్లో, చేతల్లో, మనసులో చూపాలి-తల వంచే శరీర చర్యల ద్వారా కాదు' అనే సందేశంతో కేరళ బాలసంఘం ఇచ్చిన పిలుపు ఆచరణీయమైనది.

విద్యార్థులు తల వంచే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని పొందాలి. విద్య విమర్శనాత్మక ఆలోచనను, స్వతంత్ర దృక్పథాన్ని ప్రోత్సహించాలి. సంప్రదాయ గౌరవ వ్యక్తీకరణలు ఆధునిక సమాజంలో భావాధారితంగా, పరస్పర గౌరవంతో కూడినవిగా పరిణమించాలి. విద్యార్థులలో స్వేచ్ఛ, సంభాషణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా, సమ సమాజాన్ని, పురోగమన దేశాన్ని నిర్మించగలం. తలెత్తి నడిచే విద్యార్థులు సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగల నాయకులుగా మారతారు. మన పిల్లల తలలు వంగేలా కాకుండా, గొంతుకలు ఎదిగేలా, చేతులు నిర్మించేలా, మనస్సులు ఆలోచించేలా మనం మారాలి. అప్పుడే మన విద్యా వ్యవస్థకి, మన దేశ భవిష్యత్తుకు నిజమైన గౌరవం లభిస్తుంది.

**/ వ్యాసకర్త సామాజిక కార్యకర్త, సెల్ : 9492348428/**

జనవాక్యం

## హద్దులెరిగిన స్నేహం

అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా అహంకార ధోరణి... అడ్డగోలుగా పన్నులు వడ్డించడం వల్ల...నిన్నటి దాకా ప్రత్యర్థులుగా మెలిగిన భారత్, చైనాలు తమలో దాగిన స్నేహాన్ని గుర్తించి, పెద్ద పీట వేస్తున్నాయి. తమ మధ్య భేదాలకు కారణమైన సరిహద్దు సమస్య కూడా కూర్చుని పరిష్కరించుకోవాల్సిన సమస్యే తప్ప అలవికానిది కాదని చెప్తున్నాయి. ఇరుగు పొరుగు దేశాలు వాణిజ్యంలో సహకరించుకుంటే ఇరువురికీ మేలు. ఫైట్ చేస్తూ కూర్చుంటే మధ్యలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలకు చులకన కావడం, వారి దెబ్బకు దొరకడం తప్పించి ఫలితం నాస్తి. ఆర్థిక, వాణిజ్య రంగాల్లో సహకారం అన్నది సరిహద్దు సమస్యతో వేరుగా చూడడం సాధ్యం కాదు కనుక దాని పరిష్కారాన్ని వాయిదా వేయకుండా సాధ్యం చేయాలి. అప్పుడు పరస్పర నమ్మకం పెరుగుతుంది. తమ తమ స్వంత ప్రయోజనాల్ని కాపాడుకుంటూనే ఉభయ తారకంగా వ్యవహరించాలి. ప్రపంచ వాణిజ్య సంబంధాల్లో ప్రస్తుతం నెలకొన్న కుదుపుల్ని పాఠాలుగా తీసుకుని కొత్త ఆలోచనలు చెయ్యాలి.

**- డా.డి.వి.జి. శంకరరావు,**
**మాజీ ఎంపీ. విజయనగరం.**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps @ gmail.com

# సిపిఎస్ రద్దుపై శాసనమండలిలో ప్రస్తావిస్తా

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో సోమవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొరకొండ సతీష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు అంశంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యల గురించి శాసనమండలి వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు సిపిఎస్ రద్దుతో పాటు మెరుగైన విధానం గురించి ఏడాదిలో రూట్‌మ్యాప్ ప్రకటిస్తామని చెప్పారని, నేటి వరకు దానిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని తక్షణమే తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిపిఎస్‌రద్దు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపి ఎన్జిఒ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేంత వరకు సిపిఎస్ ఉద్యోగులు చేస్తున్న ప్రతి ఆందోళన కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 2004 నుంచి అమలు చేస్తున్న కొత్త పెన్షన్ విధానం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు జరిగే నష్టాన్ని నివారించేందుకు కొత్త పెన్షన్ విధానాన్ని సమీక్షించి మెరుగైన పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం వారం రోజుల్లో సిపిఎస్‌రద్దు చేస్తామని చెప్పి ఆచరణలో మొండిచేయి చూపించిందన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికలకు ముందు సిపిఎస్ ఉద్యోగుల సమస్యను పరిష్కారం చూపుతామని చెప్పి నేడు సిపిఎస్ రద్దుపై ఏమీ మాట్లాడటం లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మరో బిఆర్‌టిఎస్ ఉద్యమం అవసరమవుతుందన్నారు. ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఉద్యోగులకు రిక్త హస్తం చూపించిందన్నారు. ఓపిఎస్ విధానం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో పెన్షన్‌లో షాక్ సిస్టమ్ రాబోతోందని, దానిని అందరూ కలిసి నిలువరించాలన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలన్నీ ఐక్య కార్యాచరణతో ముందుకు సాగితే సమస్యల పరిష్కారం సులభమవుతుందన్నారు. సచివాలయ సిపిఎస్ ఉద్యోగ సంఘం నాయకులు కోట్ల రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉద్యోగుల బకాయిలంటే లెక్కలేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ రావాలంటే బిఆర్‌టిఎస్ ఉద్యమం వస్తుందని భయం కలిగిస్తేనే ప్రభుత్వం మనతో చర్చలకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిసిపిఎస్ఇఎ ప్రధాన కార్యదర్శి సిఎం దాస్, గౌరవాధ్యక్షులు మొండితోకకుమార్, ఎపిటిఎఫ్ నాయకులు పాండురంగవరప్రసాద్‌తో పాటు 26 జిల్లాల సిపిఎస్ ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రచార గీతాల సిడిని ఆవిష్కరిస్తున్న బాబీవర్ధన్, సిహెచ్.నర్సింగరావు, రాంకీ తదితరులు

## సిఐటియు మహాసభ ప్రచార గీతాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి నాలుగు వరకు విశాఖలో జరగనున్న నేపథ్యంలో ఆ మహాసభ జయప్రదానికి ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ప్రచార గీతాలు రాశారు. ప్రముఖ సినీ నేపథ్య గాయకులు రాంకీ వెలగాడ ఆలపించారు. వాటిని సోమవారం విశాఖలోని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఎయు జర్నలిజం డిపార్ట్‌మెంట్ పూర్వ హెచ్ఒడి ఆచార్య బాబీవర్ధన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, గాయకులు రాంకీ వెలగాడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబీవర్ధన్ మాట్లాడుతూ... కార్మికవర్గానికి నాయకత్వం వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నంలో జరగడం గర్వకారణమన్నారు. ఇప్పటికే సిఐటియు ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం, కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని తెలిపారు. సమాజంలో ఏది తయారు కావాలన్నా కార్మికులు కీలకమని, వారి హక్కులను పాలకులు కాలరాయడం తగదన్నారు. సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ... సిఐటియు అఖిల భారత మహాసభ ఆంధ్ర రాష్ట్రంలో తొలిసారిగా జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 1500 మంది ప్రతినిధులు, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు, సంఘటిత, అసంఘటిత రంగాల ఫెడరేషన్ నుంచి నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, ప్రజాస్వామ్యంపై దాడి, వివిధ సెక్టార్ల అంశాలపై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడానికి ఈ మహాసభ దోహదపడతాయని చెప్పారు. ఈ మహాసభ జయప్రదానికి ప్రజలు సహకారాలు అందించాలని కోరారు. అనంతరం మహాసభ కోసం రూపొందించిన గీతాన్ని రాంకీ వెలగాడ ఆలపించారు.

## నవంబర్ 30 వరకూ అపార్ ఐడి గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు నేషనల్ అకాడమిక్ డిపాజిటరీ (ఎన్ఎడి)-అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎబిసి) ప్లాట్‌ఫామ్‌లో వెంటనే అపార్ ఐడి నమోదు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి కోరారు. కేంద్ర విద్యాశాఖ అపార్ ఐడి నమోదు గడువు నవంబరు 30 వరకు పొడిగించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## టూరిజం యూనిట్లు ప్రైవేటీకరించొద్దు : జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) పరిధిలోని యూనిట్లను ప్రైవేటీకరించొద్దని, ఉద్యోగ భద్రత కల్పించాలని జెఎసి ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి నాయకులు, ఎపిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్‌కు సోమవారం లేఖ రాశారు. ఎపిటిడిసిలో దాదాపు 20 ఏళ్లుగా రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, డైలీ వేజ్ తదితర ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఉమ్మడి రాష్ట్రం నుంచి పని చేస్తున్నారని జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం టూరిజం యూనిట్లు ప్రైవేటీకరించాలని యాజమాన్యం నిర్ణయించినట్లు తెలుస్తుందన్నారు. సంస్థ, ఉద్యోగుల, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాల రీత్యా ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు.

# క్యూబా సహకారం విలువైనది..

- వియత్నాం అధ్యక్షుడు లువాంగ్ కువాంగ్
- రెండు దేశాల దౌత్య సంబంధాలకు 65 ఏళ్లు..
- క్యూబా అధ్యక్షుడు కానెల్ పర్యటన

గౌరవ వందనం స్వీకరిస్తున్న వియత్నాం, క్యూబా అధ్యక్షులు

హనోయ్ : వియత్నాం జాతీయ విముక్తికి, రక్షణరంగ నిర్మాణానికి క్యూబా అందించిన సహకారం విలువైనదని ఆ దేశ అధ్యక్షుడు లువాంగ్ కువాంగ్ పేర్కొన్నారు. క్యూబా రిపబ్లిక్ అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్ వియత్నాం పర్యటనలో భాగంగా ఆదివారం నాడు హనోయ్ చేరుకున్నారు. డియాజ్ కానెల్‌కు పొలిట్‌బ్యూరో సభ్యులు జువాన్ థాంగ్ స్వాగతం పలికారు. అనంతరం వియత్నాం విప్లవ నేత, మాజీ అధ్యక్షుడు హోచిమిన్‌కు నివాళు లర్పించారు. వియత్నాం, క్యూబా దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 65 సంవత్సరాలైన సందర్భంగా సోమవారం హనోయ్‌లో జరిగిన వార్షికోత్సవ సభలో అధ్యక్షుడు లువాంగ్ కువాంగ్ మాట్లాడుతూ క్యూబాతో సాన్నిహిత్యం వియత్నాం ప్రజల్లో నాటుకు పోయిందని, నిరంతర సంబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. రెండు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం, ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం సమగ్ర సహకారాన్ని పరస్పరం కొనసాగిస్తామని పునరుద్ఘాటించారు. క్యూబా అన్ని ఆటంకాలను అధిగమించి గొప్ప విజయాలు సాధిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్ మాట్లాడుతూ వియత్నాం ప్రజల అసాధారణ పోరాట చరిత్ర, అద్భుతమైన విజయాలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. 1960లో వియత్నాంతో దౌత్య సంబంధాలేర్పరుచుకున్న మొదటి లాటిన్ అమెరికా దేశంగా క్యూబా గర్విస్తుందన్నారు. రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన బందమేర్పడిందని, ఇది కాల పరీక్షకు నిలబడి స్నేహానికి, సహకారానికి నమూనాగా మారిందన్నారు. గత 65 ఏళ్లలో ఇరు దేశాలు క్లిష్ట సమయాల్లో ఒకరికి ఒకరుగా తోడుగా నిలిచాయన్నారు. ఆర్థిక వ్యవస్థ, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడి, సామాజిక వ్యవస్థలు వంటి అనేక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఉగ్రవాద స్పాన్సర్ల జాబితానుండి క్యూబాను తొలగించాలని, అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తేయాల ని డిమాండ్ చేస్తున్న వియత్నాకు కృతజ్ఞతలు తెలిపారు. క్యూబా, వియత్నాం దేశాలు పది వేల మైళ్ల దూరంలో ఉన్నాయి. కానీ, ఇరు దేశాల ప్రజల హృదయాలు ఒకే కుటుంబంలోని సోదరులు వలే దగ్గరగా ఉన్నాయన్న హోచిమిన్ మాటలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను, విద్యార్థులను వేధించొద్దు

- యుటిఎఫ్, మోడల్ స్కూల్స్ సబ్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ చేయడానికి ఉపాధ్యాయులను, విద్యార్థులను వేధించడం సబబు కాదని యుటిఎఫ్, మోడల్ స్కూల్స్ సబ్ కమిటీ అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, సబ్ మోడల్ స్కూల్స్ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ బాలాజీ సోమవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు రెండు క్యాలెండర్లను పాటిస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరంలో 250 రోజులకు పైగా, స్టడీ అవర్స్‌తో కలుపుకుంటే 300 రోజులకు పైగా పనిచేస్తూ తీవ్ర పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కొత్తగా ఇచ్చిన ఉత్తర్వుల వల్ల వారిపై మరింత పనిభారం పెరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశక్తి కార్యక్రమం ఇతర అన్ని యాజమాన్యాలకు ఐచ్ఛికమని కమిషనర్ చెబుతూనే మోడల్ స్కూళ్లకు మాత్రం తప్పనిసరి చేయడం సరికాదని తెలిపారు. ఊరికి దూరంగా ఉండే మోడల్ స్కూళ్ల విద్యార్థులను ఉదయం 8 గంటలకే పాఠశాలలకు పిలిపించి సాయంత్ర 5 గంటల వరకు ఉంచడంతోపాటు భోజన సమయంలో కూడా పరీక్షలు పెట్టి హింసించడం సబబు కాదని పేర్కొన్నారు.

9 గంటలపాటు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, విద్యార్థులు కూర్చుని చదవడం చేయాలని ఏ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రతిపాదించలేదని తెలిపారు. విద్యాశాఖ నిర్ణయాలు ఉపాధ్యాయులను, విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. మంచి ఫలితాలు సాధిస్తున్నాయనే కారణంతో ఈ పాఠశాలలపై ఒత్తిడి పెంచడం ఎందుకో అర్థం కావడం లేదని తెలిపారు. ఉపాధ్యాయులను వేధించడం తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని పేర్కొన్నారు. ఇటువంటి ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. శ్రీ పులివర్తి లక్ష్మీ చెంచు నాగేశ్వరరావు, తండ్రి: వెంకట రత్నచారి, ఫ్లాట్ నెం : GF-1, గ్రౌండ్ ఫ్లోర్, సాయి చైతన్య టవర్స్, యనమలకుదురు లాకులు, యనమలకుదురు, ఎన్‌టిఆర్ జిల్లా- 520007. (తనఖాదారు & ఋణగ్రహీత).
2. శ్రీ పులివర్తి నాగమణి, భర్త: పులివర్తి లక్ష్మీ చెంచు నాగేశ్వరరావు, ఫ్లాట్ నెం: GF-1, గ్రౌండ్ ఫ్లోర్, సాయి చైతన్య టవర్స్, యనమలకుదురు లాకులు, యనమలకుదురు, ఎన్‌టిఆర్ జిల్లా- 520007. (ఋణగ్రహీత).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ శ్రీ పులివర్తి లక్ష్మీ చెంచు నాగేశ్వరరావు మరియు శ్రీ పులివర్తి నాగమణి, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) వారిని లోను అకౌంట్ శ్రీ పులివర్తి లక్ష్మీ చెంచు నాగేశ్వరరావు మరియు శ్రీ పులివర్తి నాగమణి కు సంబంధించిన బకాయి అకౌంట్ నెం. 37517740000519 క్రింద రూ. 20,51,309.37 (అక్షరాల ఇరవై లక్షలు యాభై ఒక వెయ్యి మూడు వందల తొమ్మిది రూపాయలు మరియు ముప్పై ఏడు పైసలు మాత్రమే) & లోను అకౌంట్ నెం. 37519330001086 క్రింద రూ. 4,03,018.88 (అక్షరాల నాలుగు లక్షల మూడు వేల పద్దెనిమిది రూపాయలు మరియు ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 30.12.2023 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఉగ్రవాదంపై పోరు విషయంలో దృఢమైన, నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని సదస్సుకు హాజరైన నేతలను మోడీ కోరారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌కు సంఘీభావం తెలిపినందుకు సభ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో 'ద్వంద్వ ప్రమాణాలు' పాటించరాదని, సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలను, మద్దతు ఇస్తున్న దేశాలను బాధ్యులను చేయాలని కోరారు. ఉగ్రవాదం కారణంగా భారత్ నాలుగు దశాబ్దాలుగా నష్టపోతోందన్నారు. 'ఇటీవలే పహల్గాంలో ఉగ్రవాద వికృత రూపాన్ని చూశాము. ఆ సంక్షోభ సమయంలో మాకు మద్దతు తెలిపిన స్నేహితులకు కృతజ్ఞతలు. ఇది భారత భూభాగంపై జరిగిన దాడి మాత్రమే కాదు. మానవత్వంపై నమ్మకం ఉంచే ప్రతి దేశానికీ బహిరంగ సవాలే. కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బాహాటంగా మద్దతు ఇవ్వడం ఎంతవరకు సబబు?' అని ప్రశ్నించారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా భద్రత, శాంతి, స్థిరత్వం కీలకమని చెప్పారు. ఉగ్రవాదం మానవత్వానికే సవాలు విసురుతోందనీ, దానిపై పోరులో ఐక్యత అవసరమని స్పష్టం చేశారు.

**ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోసింది అమెరికానే : పుతిన్**

ఉక్రెయిన్‌లో మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి ఆజ్యం పోసింది పశ్చిమ దేశాలేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. 'ఉక్రెయిన్‌లో జరిగిన కుట్రే సంక్షోభానికి కారణం. ఆ కుట్రకు అమెరికా మద్దతు ఇచ్చింది. రెచ్చగొట్టింది' అని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చడానికి అమెరికా చేస్తున్న నిరంతర ప్రయత్నం ఈ పరిస్థితికి కారణమేనని స్పష్టం చేశారు. కాలం చెల్లిన యూరో కేంద్రీకృత, యూరో-అట్లాంటిక్ నమూనాల స్థానంలో అనేక దేశాలకు ప్రయోజనం కలిగించే వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారం కోసం భారత్, చైనా, ఇతర వ్యూహాత్మక భాగస్వాముల ప్రయత్నాలు, ప్రతిపాదనలకు అత్యంత విలువ ఇస్తామని పుతిన్ తెలిపారు.

**ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించండి : జిన్‌పింగ్**

ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఎస్‌సిఒ సభ్యదేశాలను కోరారు. 'వెనక్కి చూసుకుంటే అల్లకల్లోలంగా ఉన్న సమయంలో కూడా షాంఘై స్ఫూర్తిని ఆచరించి విజయాలు సాధించాం. భవిష్యత్‌లోకి చూస్తే ప్రస్తుతం ప్రపంచం పరివర్తనకు గురవుతోంది. కాబట్టి మనం షాంఘై స్ఫూర్తిని కొనసాగించాలి. పాదాలను నేలపై ఉంచుతూ ముందుకు సాగాలి. సంస్థ విధులను మరింత మెరుగ్గా నిర్వర్తించాలి' అని కోరారు. సమానమైన, క్రమబద్ధమైన బహుళ ధృవ ప్రపంచం కోసం సమంజసమైన ప్రపంచ పాలనా వ్యవస్థను రూపొందించడానికి సభ్య దేశాలు కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది సభ్య దేశాలకు 280 మిలియన్ డాలర్ల సాయం అందిస్తామని, ఎస్‌సిఒ బ్యాంకింగ్ కన్సార్టియంకు 1.4 బిలియన్ల రుణాన్ని ఇస్తామని ప్రకటించారు. వాణిజ్యాన్ని, పెట్టుబడుల స్థాయిని పెంచుకోవడానికి భారీ మార్కెట్‌ను ఉపయోగించుకోవాలని జిన్‌పింగ్ చెప్పారు.

## విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆందోళన

- డిసెంబర్ 10న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో భారీ ప్రదర్శనలు
- ఇఇఎఫ్ఐ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్రం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో వేగంగా ప్రైవేటీకరణ ప్రయత్నాలపై ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమిళనాడులోని ఊటీలో రెండు రోజులపాటు జరిగిన ఇఇఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సమావేశంలో విద్యుత్ రంగంలో గత నాలుగు నెలలుగా జరుగుతున్న పరిణామాలను చర్చించారు. రాబోయే నెలల్లో విద్యుత్ రంగ ఉద్యోగులు, వినియోగదారులలో ఇఇఎఫ్ఐ విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. డిసెంబర్ 10న దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గత తొమ్మిది నెలలుగా రాష్ట్ర/ప్రభుత్వ విద్యుత్ సంస్థల స్పష్టమైన ప్రైవేటీకరణ ప్రయత్నాలను విజయవంతంగా ప్రతిఘటిస్తున్న ఉత్తరప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల సాహసోపేత పోరాటాన్ని వర్కింగ్ కమిటీ అభినందించింది. ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరణ ప్రయత్నంలో మరింత తీవ్రతరం అయితే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. పుదుచ్చేరి, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు, కర్ణాటకలో కూడా ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం అవుతున్నాయని, దేశంలోని విద్యుత్ రంగాన్ని అదానీకి అప్పగించేందుకు మోడీ సర్కారు కుట్రలు పన్నుతుందని విమర్శించారు.

పౌర అణు రంగాన్ని ప్రైవేటు భాగస్వామ్యానికి తెరవాలనే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం దాని సంస్కరణల ఎజెండాలో చిన్న మాడ్యులర్ రియాక్టర్లను (ఎస్‌ఎంఆర్‌లు) కేంద్రంగా ఉంచిందని అన్నారు. రిలయన్స్, టాటా పవర్, అదానీ, వేదాంత, జిందాల్ వంటి ప్రధాన ప్రైవేట్ కంపెనీలు ఎస్‌ఎంఆర్ రంగంలోకి ప్రవేశించడానికి ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. సిఎల్‌ఎన్‌డి చట్టం నుంచి సరఫరాదారు బాధ్యతను ఉపసంహరించుకోవడం ప్రమాదకరమైన వినాశనానికి దారి తీస్తుందని అన్నారు. ఇఇఎఫ్ఐ ఈ సమస్యలన్నింటినీ దేశంలోని విద్యుత్ ఉద్యోగులు, ప్రజల వద్దకు తీసుకువెళుతుందన్నారు. ఈ ప్రమాదకరమైన ప్రజా వ్యతిరేక ఇంధన విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనను నిర్మిస్తుందని పేర్కొన్నారు. డిసెంబర్ 10న 'జాతీయ కార్యాచరణ దినోత్సవం' సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

**అత్యంత భయంకర భూకంపాలు (మృతుల పరంగా)**

| సంవత్సరం | ప్రాంతం | మరణాలు | తీవ్రత (రిక్టర్‌పై) |
|---|---|---|---|
| 1976 | హెబెయి (చైనా) | 3 లక్షలకుపైగా.. | 7.6 |
| 1920 | నింగ్సాయి (చైనా) | 2,73,400 | 7.8 |
| 2004 | సుమత్రా (ఇండోనేషియా) | 2,27,898 | 9.2 |
| 1948 | అషాగబాట్ (టర్కీ) | 1,10,000 | 7.3 |
| 1923 | కంటో రీజన్ (జపాన్) | 1,05,385 | 7.9 |
| 2010 | హైతీ | 50 వేలు | 7.0 |
| 1927 | గాన్సు (చైనా) | 40,912 | 7.7 |
| 1934 | కోషి (నేపాల్) | 12 వేలు | 8.0 |
| 1931 | షింజియంగ్ (చైనా) | 10 వేలు | 8.0 |

## అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం!

**మొదటి పేజీ తరువాయి**

రాజంపేట మండలం కె.బోయనపల్లిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ, కార్యకర్తల సమావేశం, పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైసిపిని ఉద్దేశిస్తూ, ఓ ఫేక్ పార్టీ... ఓ పేపర్, టివి ఛానల్ పెట్టుకుందని, బ్లూ మీడియా అడ్డగోలు రాతలు రాస్తోందని, దానికి సమాధానాలు చెప్పాలా? అని ప్రశ్నించారు. పోలవరం నిర్మిస్తుంటే కూల్చేస్తుంటారని, అమరావతిని ఎడారి చేస్తాంటారని, రోడ్లు వేస్తే గుంతలు పెడతారని విమర్శించారు. ఎన్నికల సమయంలో సిద్ధం పేరుతో ఫేక్ పార్టీ ఎగిసి పడిందని, ఆ పార్టీకి చెందిన 11 మంది ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీకి వస్తే అన్నింటిపైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికలు మొదలుకుని, బాబాయ్ గొడ్డలి వేటు, దళిత డ్రైవర్ మృతదేహం డోర్ డెలివరీ, కోడి కత్తితో దాడి కేసు, గులకరాయి డ్రామా వరకు అన్నింటిపైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆటో, ట్రాక్టర్ నడుపుతున్న వైసిపి కార్యకర్తలకు వికలాంగ పింఛన్లు మంజూరు చేశారని ఆరోపించారు. పింఛను ఇవ్వడం ధానం, ధర్మం కాదని, బాధ్యతని పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో అర్హులను విస్మరించడాన్ని సహించబోమని హెచ్చరించారు.

**నదుల అనుసంధానం అవసరం**

నదుల అనుసంధానం అవసరమని చంద్రబాబు తెలిపారు. దేశంలోని గంగానది నుంచి కావేరి నది వరకు అనుసంధానం చేయాలన్నారు. రాష్ట్రంలో వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తామని తెలిపారు. ఇప్పటికే రాయలసీమలోని కుప్పానికి కృష్ణా జలాలను తీసుకెళ్లామని, వచ్చే ఏడాది చిత్తూరు, మదనపల్లి, పీలేరు, గాలేరు-నగరి, మూడో ఏడాది కడప, రైల్వే కోడూరుకు సైతం నీళ్లిస్తామన్నారు. ఏడాదికి లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని తెలిపారు. రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. 2014 నుంచి 2019 వరకు దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తామని ప్రకటించారు. 30 ఏళ్ల కిందట సెప్టెంబర్ ఒకటిన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, రాజంపేటలోనే పర్యటించానని గుర్తు చేసుకున్నారు. రజకుల కోసం దోబీఘాట్‌లు నిర్మించానని, ఆదరణ-1, 2 పథకాల ద్వారా చేతివృత్తిదారులకు పనిముట్లు అందజేశానని తెలిపారు. అంతకుముందు పెదకారంపల్లికి చెందిన సుమిత్రమ్మ అనే వికలాంగురాలికి పింఛను అందించారు. ఆ తర్వాత పి-4 పథకం కింద బోయనపల్లికి చెందిన కల్యాణి, ఏసమ్మ కుటుంబాలను ఆదుకోవాలని యు.సుబ్రమణ్యం, ఎస్. వెంకటరమణ అనే మార్గదర్శులకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గడువు దాటినా ఫైల్ చేయొచ్చు!

- క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై సుప్రీంకు తెలిపిన ఇసి
- ఓటర్లకు అవగాహనకై లీగల్ వలంటీర్లను ఏర్పాటు చేయండి
- సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ :** బీహార్ ముసాయిదా జాబితా నుండి పేర్లను తొలగించాలని లేదా తీసివేయాలని కోరుతూ వచ్చిన అభ్యర్థనలు... పేర్ల పునరుద్ధరణ కోసం వచ్చిన క్లెయిమ్‌ల కన్నా దాదాపు ఆరు రెట్లు పెరిగాయని ఎన్నికల కమిషన్ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆధార్‌ను సుప్రీంకోర్టు అనుమతించిన ఆగస్టు 22 నుండి 30వ తేదీ మధ్య కాలంలో పేర్లను చేర్చాలని కోరే వారి కన్నా తొలగించాలని కోరేవారే ఎక్కువయ్యారని ఒక నోట్‌ను అందజేసింది. సెప్టెంబరు 1 డెడ్‌లైన్ దాటిన తర్వాత కూడా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని ఎన్నికల కమిషన్ తెలియజేసింది. వాటిని కూడా పరిశీలించిన తర్వాతే ఓటర్ల జాబితా ఖరారుచేస్తామని తెలిపింది. నామినేషన్ల చివరితేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించే క్రమం కొనసాగుతుందని, తుది జాబితాలో అన్నింటినీ పొందుపరుస్తామని ఇసి ఆ నోట్‌లో వివరించింది. బీహార్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ సందర్భంగా తమ క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలను ఆధార్‌తో దాఖలు చేయవచ్చని కోర్టు ఆగస్టు 22న పేర్కొంది. ఆధార్‌ను అర్హమైన పత్రంగా గుర్తిస్తూ కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో ముసాయిదా జాబితాలో తమ పేర్లను పునరుద్ధరించాలని కోరే ఓటర్లు పెరిగారని రాజకీయ పార్టీలు, పిటిషనర్లు పేర్కొన్నారు. అందుకు భిన్నంగా ఆగస్టు 22 తరువాత పేర్లు చేర్చాలని కోరే క్లెయిమ్‌లు 22,723 మాత్రమే అందాయని ఇసి తెలిపింది. ముసాయిదా నుండి పేర్లను మినహాయించాలని లేదా తొలగించాలని కోరే అభ్యంతరాలు 1,34,738 దాఖలయ్యాయని ఇసి తన నోట్‌లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతోకూడిన బెంచ్‌కు తెలిపింది. ముసాయిదా జాబితా నుండి పేర్లు తొలగించాలని కోరేందుకు కారణాలుగా మరణాలు, రెండు చోట్ల పేర్లు వుండడం వంటి అంశాలను పేర్కొంటున్నారని ఇసి తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. ఆర్‌జెడి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఓటర్లకు సహకరించాయని ఇసి తెలిపింది. రాజకీయ పార్టీల నుంచి 128 ఫారాలే అందాయని తెలిపింది. వీటిలో ముసాయిదా నుండి పేర్లను తొలగించాలని కోరేవి 103 ఫారాలు కాగా, పేర్లను చేర్చాలని కోరుతున్నవి 25 మాత్రమేనని తెలిపింది. ఓటర్లే చాలా చురుగ్గా వున్నారని, తమ పేర్లను చేర్చాలని కోరుతున్న దరఖాస్తులు వ్యక్తిగత ఓటర్ల నుండి 33,326 అందాయని తెలిపింది. పేర్లను తొలగించాలని కోరే దరఖాస్తులు 2,07,565 అందాయని పేర్కొంది.

**లీగల్ వలంటీర్లను ఏర్పాటు చేయండి**

ప్రతి జిల్లాలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, దిద్దుబాట్లు వంటి విషయాల్లో ఓటర్లకు, రాజకీయ పార్టీలకు సాయం చేయడానికి పారా లీగల్ వలంటీర్లను ఏర్పాటు చేయాలని బీహార్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్‌పర్సన్‌ను కోర్టు ఆదేశించింది. వచ్చిన సమాచారాన్నంతా ఆ వలంటీర్లు ఎవరికి వారు కాన్ఫిడెన్షియల్ నివేదికలుగా సంబంధిత జిల్లా, సెషన్స్ న్యాయమూర్తికి అందజేయాలని పేర్కొంది. ముసాయిదా జాబితాలోని 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.5 శాతం మంది అర్హతా పత్రాలను అందజేశారని, వాటి పరిశీలన సాగుతోందని, సెప్టెంబరు 25కల్లా పూర్తి చేయాల్సి వుందని ఇసి పేర్కొంది. 15.3 లక్షల మంది కొత్త ఓటర్లు పేర్లను చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది.

## రాజ్యాంగాన్ని దెబ్బతీసే చర్యలు సహించం

**మొదటి పేజీ తరువాయి**

పోలీసులు ప్రవేశం నిరాకరించిన తరువాత, దక్బంగ్లా జంక్షన్ వద్ద తాత్కాలిక వేదికను నిర్మించి, అక్కడ ముగింపు సభను నిర్వహించారు.

**ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం**

కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఓటుహక్కును ఉల్లంఘించడానికి అనుమతించబోమని ప్రతిపక్ష నాయకులు ఏకగ్రీవంగా ప్రకటించారు. రాబోయే రోజుల్లో మోడీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను నిరసిస్తూ పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కూడా నాయకులు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని, అందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆగస్టు 17న ససారాం నుండి ప్రారంభమైన 'ఓటు అధికార్ యాత్ర' 25 జిల్లాల్లో 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 16 రోజుల పాటు 1,300 కిలోమీటర్లు సాగింది. పాట్నాలో సోమవారం జరిగిన యాత్ర ముగింపు సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీహార్ ప్రతిపక్షనేత తేజస్వి యాదవ్, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఐఎంఎల్ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, టిఎంసి ఎంపి, క్రికెటర్ యూసుఫ్ పఠాన్, శివసేన నేత సంజయ్ రౌత్, ఎన్‌సిపి నేత సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు.

**ప్రధాని ముఖం చూపించలేరు : రాహుల్‌గాంధీ**

రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలో ఓట్ల చోరీకి సంబంధించి ఇప్పటికే అణుబాంబు పేల్చామని, త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని అన్నారు. దీంతో ప్రధాని మోడీ దేశానికి ముఖం చూపించలేరని, ఆయన గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఆ బాంబును ఎదుర్కొనేందుకు బిజెపి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 'రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. అందుకు మేం అనుమతించబోం. బిజెపిని అడ్డుకునేందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది.

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి నేతృత్వంలో సభకు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు

మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్లచోరీ జరిగిందని ఆధారాలతో సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంపై త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేలుస్తాం' అని స్పష్టం చేశారు. బిజెపి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా.. ప్రవర్తించిందని, ఎవరు ఏ తప్పు చేసినా ఎప్పుడో ఒక సమయంలో దొరికిపోతారని, ఇప్పుడు ఆ సమయం బిజెపికి వచ్చిందని అన్నారు. ఓట్ల చోరీలో వాస్తవాలను ప్రజలు తెలుసుకోబోతున్నారని తెలిపారు.

**బీహార్‌లో ఓట్ల చోరీతో గెలవాలని ప్రయత్నిస్తున్నారు : ఖర్గే**

కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోడీ ఓట్ల చోరీతో గెలవడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్‌డిఎ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఓడిపోతుందని జోస్యం చెప్పారు. 'ఓటరు హక్కు యాత్ర' గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఈ యాత్రను ఆపడానికి బిజెపి తన శాయశక్తులా ప్రయత్నించిందని అన్నారు.

**బిజెపి ఓట్ల చోరీ రాజ్యాంగంపై దాడి : ఎంఎ బేబీ**

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ఓట్లను దొంగిలిస్తోందని, ఈ వాస్తవం తెరపైకి వచ్చిందని అన్నారు. ఈ వ్యక్తులు ప్రజాస్వామ్యానికి శత్రువులని అన్నారు. ఓట్లను దొంగిలించడం ద్వారా కేంద్రం రాజ్యాంగంపై దాడి చేస్తోందని విమర్శించారు. మన ఓటు హక్కు కోసం, దానిని కాపాడుకోవడానికి మనమందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జాతీయ కార్యదర్శి ఎ రాజా మాట్లాడుతూ.. రాజ్యాంగం నుంచి పొందిన ఓటు హక్కును కాపాడుకోవాలని అన్నారు. దేశ ప్రజలతో కలిసి, ఓటు దొంగలను అధికారం నుండి తొలగిస్తామన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ.. నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థ వెన్నెముకను ఎలా విచ్ఛిన్నం చేసిందో ఇప్పుడు దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. అదేవిధంగా ఓట్ల దొంగతనంతో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేయడానికి ప్రయత్నం జరుగుతోందని అన్నారు. అందుకే బీహార్‌లో 'ఓటరు హక్కుల యాత్ర'ను ప్రారంభించామని, దీనిలో 'ఓటరు చోర్ - గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఇచ్చామని అన్నారు.

**బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఓట్ల చోరీ : హేమంత్ సోరెన్**

జెఎంఎం అధ్యక్షులు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మాట్లాడుతూ.. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ ఇడి, సిబిఐ, ఐటి సహాయంతో ఓట్లను దొంగిలిస్తోందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి జరుగుతున్న ఓట్ల చోరీ ఇప్పుడు పట్టుబడిందని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు 'ఓటు దొంగలకు' వ్యతిరేకంగా తమ స్వరాన్ని పెంచాలని పిలుపునిచ్చారు.

**మోసగాళ్లకు బీహార్ ప్రజలు గుణపాఠం చెబుతారు : తేజస్వి యాదవ్**

ఆర్‌జెడి నేత, బీహార్ ప్రతిపక్షనేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్‌తో కలిసి బిజెపి నేతలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నారని విమర్శించారు. నరేంద్ర మోడీ గుజరాత్‌లో మాదిరిగా బీహార్‌ను మోసం చేయాలనుకుంటున్నారని, కానీ ఇది సాధ్యం కాదని పేర్కొన్నారు. బీహార్ ప్రజలు ఇలాంటి మోసగాళ్లకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ప్రజల ఖర్చుతో బ్రాహ్మణులకు లాభాలు..

- వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు తీవ్ర వ్యాఖ్యలు

**వాషింగ్టన్ :** ఇటీవల ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి తప్పుడు వ్యాఖ్యలు చేసిన వైట్ హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో మరోమారు భారత్‌పై అవాకులు చెవాకులు మాట్లాడారు. బ్రాహ్మణులు భారతీయ ప్రజల ఖర్చుతో లాభపడుతున్నారని ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "బ్రాహ్మణులు భారతీయ ప్రజల ఖర్చుతో లాభం పొందుతున్నారు. ఇది ఆగాలి" అని అన్నారు. అమెరికా ఆసక్తులకు వ్యతిరేకంగా భారత్ వాణిజ్య, భౌగోళిక రాజకీయాలను ప్రోత్సహిస్తుందన్నారు. అమెరికా ఉత్పత్తులపై భారతదేశం అత్యధిక సుంకాలను వేస్తోందని.. తమ వస్తువులను ఇండియాలో విక్రయించడానికి అనుమతించరన్నారు. భారత ప్రధాని మోడీ గొప్ప నాయకుడు అంటూ.. రష్యా, చైనాతో సన్నిహితంగా ఎందుకు ఉంటున్నారన్నారు. రష్యన్ ఆయిల్ నుండి భారతదేశం లాభం పొందుతోందని గతంలోనూ నవరో విమర్శించారు. భారత రిఫైనరీలు తక్కువ ధరకు రష్యన్ ఆయిల్‌ను కొనుగోలు చేసి, యూరప్, ఆఫ్రికా, ఆసియాకు ఎగుమతి చేస్తున్నాయన్నారు.

## ఆఫ్ఘన్‌లో భారీ భూకంపం

**మొదటి పేజీ తరువాయి**

లోయలోని గ్రామాలన్నీ కొండచరియల కింద శిథిలమై పోయాయి. రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆఫ్ఘనిస్థాన్ - పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ప్రాంతాలలో కూడా 4.0 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయి.

**యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు**

భూకంపం ధాటికి అనేక భవనాలు నామరూపాలు లేకుండా కూలిపోయాయి. వాటి కింద చిక్కుకుపోయిన క్షతగాత్రులను స్ట్రెచర్లపై మోసుకొచ్చి హెలికాప్టర్లలో ఆస్పత్రులకు తరలిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అన్ని బృందాలనూ రంగంలోకి దింపామని తాలిబాన్ హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి అబ్దుల్ మతీన్ క్వానీ తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టామన్నారు. మారుమూల ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకుంటున్నాయని రాజధాని కాబూల్‌లో ఆరోగ్య అధికారులు చెప్పారు. 2022 జూన్ తర్వాత ఆఫ్ఘన్‌లో భారీ స్థాయిలో భూకంపం సంభవించడం ఇదే మొదటిసారి. గాయపడిన వారిని అంబులెన్సులలో తరలించేందుకు సైనికులు, వైద్య సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలకు స్థానికులు కూడా తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

**మూడు గ్రామాలు నేలమట్టం**

భూకంపం ధాటికి కునార్ ప్రాంతంలోని మూడు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. అనేక ఇతర గ్రామాల్లో కూడా కోలుకోలేని విధంగా నష్టం జరిగింది. ఒక్క కునార్‌లోనే 600 మందికి పైగా చనిపోయారు. నంగర్‌హార్‌లో 12 మంది విగతజీవులయ్యారు. పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌క్వా సరిహద్దున ఉన్న భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్న సహాయ సిబ్బంది శిథిలాల కింద చిక్కుబడిపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. హెలికాప్టర్లతోపాటు 40 విమానాల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

**తరచూ భూకంపాలే !**

ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంపాలు తరచుగా సంభవిస్తూ వుంటాయి. హిందూ కుష్ పర్వత ప్రాంతంలో ఇవి ఎక్కువగా నమోదవుతూ వుంటాయి. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో 2023 అక్టోబరులో సంభవించిన భూకంపం కారణంగా 1500 మందికి పైగా చనిపోయారు. 63వేలకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. అప్పుడు భూకంప తీవ్రత 6.3గా వుంది. 2022 జూన్‌లో 5.9 తీవ్రతతో సంభవించిన భూకంపంలో వెయ్యి మందికి పైగా మరణించారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.

**ప్రపంచ దేశాల ఆపన్న హస్తం**

భూకంపం ధాటికి విలవిలలాడుతున్న ఆఫ్ఘనిస్థాన్‌కు ఐక్యరాజ్యసమితి అత్యవసర సాయాన్ని పంపింది. అక్కడ నెలకొన్న పరిస్థితులు అత్యంత దారుణంగా వున్నాయని, ఇది తమను తీవ్రంగా కలచివేస్తోందని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి బృందాలు ఇప్పటికే భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని, అత్యవసర సాయాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో నిమగ్నమయ్యాయని తెలిపింది. 'ఈ విషాద సమయంలో తమ ఆలోచలన్నీ బాధిత ప్రజల చుట్టూనే తిరుగుతున్నాయి' అని వ్యాఖ్యానించింది.

**మానవతా సాయాన్ని అందిస్తాం : మోడీ**

భారత్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌కు మద్దతును, సంఘీభావాన్ని తెలియజేసింది. బాధిత కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ సానుభూతి తెలిపారు. 'ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భూకంపంలో భారీగా ప్రాణనష్టం సంభవించడం నన్ను బాధించింది. ఈ కష్టకాలంలో మా ఆలోచనలు, ప్రార్థనలన్నీ బాధిత కుటుంబాల గురించే, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బాధితులకు అవసరమైన మానవతా సాయాన్ని అందించడానికి భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆఫ్ఘన్‌కు సాయం చేసేందుకు ఇరాన్ కూడా ముందుకొచ్చింది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా టారిఫ్‌లను ఎదుర్కోవాలి

**మొదటి పేజీ తరువాయి**

అన్వేషించాలని సూచించారు.

**గార్మెంట్ పరిశ్రమ దెబ్బతింటోంది**

గార్మెంట్ పరిశ్రమ కూడా దెబ్బతింటోందని అన్నారు. అనకాపల్లి జిల్లాలో 23 వేలమంది గార్మెంట్ రంగంలో పనిచేస్తుంటే నాలుగు నెలలకాలంలో 18వేల మందికి తగ్గిపోయారని తెలిపారు. ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడులు ఆచరణలో కనిపించడం లేదని, ఉన్న ఉపాధి, ఆదాయాలు పడిపోతున్నాయని పేర్కొన్నారు. సత్యసాయి జిల్లాల్లో ఐదారువేల మంది ఉపాధి పోతోందన్నారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల వల్ల స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయని అన్నారు. అదే సమయంలో కేంద్రం పత్తి దిగుమతులపై సుంకం రద్దు చేయడంతో రైతులు బలైపోతున్నారని తెలిపారు. టెక్స్‌టైల్ ఇండస్ట్రీని ఆదుకోవాలంటే ఎగుమతి సబ్సిడీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా 5వ తేదీన రైతు సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయని, సిపిఎం తరపున దానిని బలపరుస్తున్నామని తెలిపారు.

**ప్రైవేటీకరణకు సహకరిస్తూ బుకాయింపులు**

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ముక్కలు చేసి అమ్మేస్తుంటే స్పందించకపోగా టిడిపి, జనసేన నాయకులు ప్రైవేటీకరణ జరగదని బుకాయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు గంభీర ప్రకటనలు చేసిన పవన్‌కల్యాణ్ విశాఖలో జరుగుతున్న జనసేన సమావేశంలో ప్లాంటు గురించి ఒక్కమాట కూడా మాట్లాడలేదని అన్నారు. ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకోవడం చేతగాక కార్మిక సంఘాలు, కార్మికులపై నెపం నెడుతున్నారని అన్నారు. ప్రైవేటీకరించాలని కోరిన కార్మిక సంఘాల నాయకులు ఎవరో బయపట్టాలని డిమాండ్ చేశారు. ప్లాంటుకు ఇచ్చిన రూ.11,400 కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారో లెక్కలు బయట పెడితే అసలు బండారం బయటపడుతుందని అన్నారు. 46 విభాగాల్లో ప్రైవేటీకరణకు టెండర్లు పిలిచారో లేదో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమాధానం చెప్పాలన్నారు. మంత్రి లోకేష్ ఎన్‌ఎండిసి టెండర్లలో పాల్గొని ప్లాంటు గనులు కొనుక్కోవచ్చని ఢిల్లీలో చెబితే టిడిపి ఎంపిలు మిట్టల్‌కు గనులు కేటాయించాలని కేంద్ర ఉక్కు మంత్రిని కలిశారన్నారు. ప్రత్యక్షంగా తెలుగుదేశం, జనసేన ప్లాంటు ప్రైవేటీకరణకు తోడ్పడుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న దీక్షా శిబిరాన్ని ధ్వంసం చేశారన్నారు. ప్లాంటు విషయంలో రాష్ట్రం కేంద్రం కుట్రలకు తోడవుతోందని, ఇద్దరూ కలిసే చేస్తున్నారని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అడ్డగోలుగా భూములు లాక్కుంటోందని, సిపిఎంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

**పోలవరం వర్కు డాక్యుమెంటేషన్ లేదు**

పనులు ఆలస్యంగా నడుస్తున్నాయని, వర్కు డాక్యుమెంటేషన్ జరగడం లేదని పోలవరంపై విదేశీ నిపుణులు తెలిపారని, అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వివరాలు లేకపోతే నష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారో తెలపాలన్నారు.

చంద్రబాబు స్వయంగా మునక ప్రాంతాల ప్రజల దుస్థితిని పరిశీలించి అక్కడ ప్రజల సంక్షేమాన్ని చేపట్టాలని కోరారు. పునరావాస కాలనీల కాలనీల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనసేన అంశంపై మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు శ్రీనివాసరావు స్పందిస్తూ జనసేన సిద్ధాంతం ఏమిటో వారి పార్టీ వాళ్లకు కూడా తెలియదన్నారు. సిద్ధాంత నిబద్ధత లేదని, ఎప్పుడు ఏది కావాలంటే అదే చెబుతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ ఆర్‌ఎస్‌ఎస్ మౌత్‌పీస్ లా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## ఆ చిన్నారులను గ్వాటెమాలాకు పంపొద్దు

- అమెరికా ప్రభుత్వాన్ని ఆదేశించిన జడ్జి

**వాషింగ్టన్ :** గ్వాటెమాలా చిన్నారులను స్వదేశానికి పంపేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అమెరికా న్యాయమూర్తి తాత్కాలికంగా అడ్డుకున్నారు. చిన్నారులను విమానాలలోకి ఎక్కించి గ్వాటెమాలాకు పంపుతున్నారంటూ వచ్చిన వార్తలపై స్పందించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి స్పార్కిల్ సూక్‌నానా ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

ఒంటరిగానే అమెరికాకు వచ్చిన ఈ పిల్లలు ప్రభుత్వ కస్టడీలో కాలం గడుపుతున్నారు. వీరిని గ్వాటెమాలాకు తిప్పిపంపితే వేధింపులకు గురవుతారని న్యాయవాదులు తెలిపారు. చిన్నారులను తిప్పి పంపడం లేదని, కుటుంబాలతో కలిసి ఉండేందుకు వారిని అప్పగిస్తున్నారని గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరేవలో, అమెరికా న్యాయ శాఖకు చెందిన న్యాయవాదులు చెబుతున్నారు. తమ పిల్లలు తిరిగి వస్తున్నారని తెలుసుకున్న అనేకమంది తల్లిదండ్రులు రాజధానిలోని రిసెప్షన్ కేంద్రం వద్దకు చేరుకున్నారు.

**జీవన సౌరభం**

ప్రవర్తన అద్దం లాంటిది. ప్రతి వ్యక్తి ప్రతిబింబం దానిలో కనిపిస్తుంది.

**మీ కోసం**

టమాటాలను కోసేటప్పుడు రసం కారకుండా ఉండాలంటే.. పళ్లున్న కత్తిని ఉపయోగించాలి.

## సమస్తాన్ని నేను

చెట్టును నేను
సమస్త జీవులకు
ప్రాణభిక్షను నేను
అమ్మను నేను
అమృతం నేను
తడారిన గొంతు
దాహార్తిని తీర్చి
ప్రాణం నిలిపే
నీరును నేను
ఏరును నేను
కణ కణ మండే
సూర్య తాపం నుండీ
జీవులను కాపాడే
చల్లని గాలిని నేను
సెలయేరును నేను
చెట్టును నేను
పుట్టను నేను
గుట్టను నేను
కొమ్మను నేను
రెమ్మను నేను
ఆకును నేను
ప్రాణుల ఉచ్ఛ్వాస నేను
నిశ్వాసం నేను
నింగిన విహరించే
పురుగును నేను
కలుగును నేను
కళను నేను
ఇలను నేను
సేదను నేను
నీడను నేను
తరతరాల సంస్కృతీ
సంప్రదాయాల
వారధి నేను
సారధి నేను
ఆకాశంలోని మబ్బును నేను
వానాకాలం వర్షం నేను
వర్షపు నీటి బిందువును నేను
నిన్నను నేను
రేపును నేను
నేటి వర్తమానాన్ని నేను
చెలిమిని నేను
కలిమిని నేను
బలిమిని నేను
హలాన్ని నేను
కలాన్ని నేను
కమ్మని పరిమళపు
స్నేహం నేను
ఎడబాటును నేనే
ప్రేమను నేనే
పగను సెగను నేనే
అమ్మను నేనే
భావి నేనే
బావిని నేనే
కావ్యం నేను
కన్యను నేనే
నింగిని నేను
నేలను నేను
మంటిని నేనే
మింటను నేనే
రాజును నేనే
బంటును నేనే
స్వరాన్ని వరాన్ని నేనే
నేనే నేనే
సమస్తాన్ని నేనే

**- రాళ్లబండి సంగం నాయుడు, జరజాపూపేట, విజయనగరం 94909 35258.**

### అవి ఏవీ?

**పిల్లలూ, పై వరుసలో ఉన్న ఉడతల్లో ఒకటి, కింది వరుసలో ఉన్న ఉడతల్లో మరొకటి ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.**

**జవాబు: 2-8**



### నేను గీసిన బొమ్మ

**కె.రోహిత్**
6వ తరగతి,
జెడ్‌పిహెచ్ స్కూలు,
మెట్టవలస, లావేరు
మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# అమ్మాయి చదువు భవితకి వెలుగు..

**'అమ్మాయిలకి చదువెందుకు' అన్న ధోరణి నుండి ఈ సమాజం ఇంకా బయటపడలేదు. అందుకే 'అమ్మాయిలు చదువుకోవాలి. సమాజ భవితకి వారు విద్యావంతులు కావడం అత్యవసరం' అంటున్నారు ఎందరో వ్యక్తులు. అలాంటి వారిలో ఒకరే సఫీనా హుస్సేన్. 17 ఏళ్ల క్రితం ఆమె స్థాపించిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థ ఆడపిల్లలని చదివించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తోంది. ఈ రెండు దశాబ్దాల్లో విద్యకి దూరమైన సుమారు రెండు లక్షలకి పైగా ఆడపిల్లలు మళ్లీ చదువుకున్నారు. ఉన్నత లక్ష్యాలను అందుకున్నారు. 2035 నాటికి ఈ సంఖ్య 10 లక్షలకి చేరుకోవాలన్న లక్ష్యం పెట్టుకున్న ఈ సంస్థకి ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. తాజాగా 'రామన్ మెగసెసే అవార్డు-2025' వరించింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు సఫీనా గురించి, సంస్థ సాధించిన విజయాల గురించి వివరంగా తెలుసుకుందాం.**

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన సఫీనా స్కూల్‌డ్రాపౌట్. 12వ తరగతి తరువాత కుటుంబ పరిస్థితులు ఆమెని విద్యకి దూరం చేశాయి. తల్లి ఉష హిందువు. తండ్రి వ్యాపారవేత్త, నటుడు అయిన యూసుఫ్ హుస్సేన్ ముస్లిం. ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఉష, హుస్సేన్ ప్రేమించి పెళ్లి చేసుకుని పెద్దలకు దూరంగా ఢిల్లీలో మకాం పెట్టారు. అక్కడే సఫీనా పుట్టారు. ఆ జంటకి ఆమె ఒక్కత్తే సంతానం. బాల్యం నుండి తాను ఎన్నో సవాళ్లని ఎదుర్కొన్నట్లు సఫీనా స్వయానా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సంతోషంగా లేని సందర్భాలెన్నింటినో చూశానని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో తల్లీదండ్రీ విడిపోయినప్పుడు, 12వ తరగతితోనే చదువుకు స్వస్థి చెప్పిన సఫీనా తన బాల్యాన్ని ఇలా జ్ఞాపకం చేసుకున్నారు.

'చదువు ఆపేసిన తరువాత మూడేళ్ల పాటు స్కూలుకి వెళ్లలేదు. అప్పుడు నా చుట్టుపక్కల వాళ్లు 'ఈ పిల్లకి పెళ్లి చేయడమే నీ మొదటి కర్తవ్యం' అని అమ్మకి చెప్పేవారు. అప్పుడు మా కుటుంబానికి దగ్గర బంధువు, వరుసకి అత్త అయిన మహి హసన్ నన్ను వెతుక్కుంటూ మా ఇంటికి వచ్చింది. ఆమె నా కోసమే వచ్చానని చెప్పింది. 'బాల్యం నుండి నేను ఎన్నో కష్టాలు పడ్డానని, ఇక నన్ను బాధపెట్టొద్దని, తనతో పంపించమ'ని అమ్మని బతిమాలింది. అలా నేను అత్తతో పాటు లండన్ వెళ్లాను. అక్కడే గ్రాడ్యుయేట్ చేశాను'.

లండన్‌లో యూనివర్శిటీ విద్య పూర్తి చేసిన సఫీనా, విద్య వల్ల తను పొందిన మెరుగైన జీవితాన్ని ఓ పాఠంగా సమాజానికి అందివ్వాలని అనుకున్నారు. విద్య, కెరీర్‌లకి దూరంగా జరిగిపోయిన ఆడపిల్లల చదువు బాధ్యతని తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

శానిఫ్రాన్సిస్కో ఇంటర్నేషనల్ చైల్డ్ ఫ్యామిలీ హెల్త్ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 7 ఏళ్లు విధులు నిర్వహించిన సఫీనా, 2004లో ఇండియాకి తిరిగివచ్చారు. అప్పుడు జి-20 ప్రకటించిన ఓ సర్వే 'ఆడపిల్లల పుట్టుకకి భారత్ చెత్త ప్రదేశం' అని నిర్ణయించారు. ఆ ప్రకటన సఫీనా నిద్రపోనీయ్యలేదు. అప్పటికే దేశంలో లింగవివక్ష ఆందోళనకరంగా వృద్ధిచెందింది. దీనంతటికీ ముఖ్యకారణం ఆడపిల్లలు చదువుకోకపోవడమే అని ఆమె బలంగా నమ్మారు. పాఠశాలల్లో బాలికల హాజరుశాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆమెకి కష్టంగా అనిపించింది.

అసలు 'ఆడపిల్లలు చదువుకు ఎందుకు దూరమవుతున్నారు? అన్న అంశంపై లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించారు. బాధిత మహిళల్లో తననే మొదటి వ్యక్తిగా బేరీజువేసుకుని ఆలోచించారు. ఆమె ప్రశ్నలకి సమాధానం దొరికింది. 'చదువుకోని అమ్మాయిలే కాదు, చదువుకున్న మహిళలు కూడా ఉపాధి మార్గాల్లో రాణించకుండా ఇంటికే పరిమితమవ్వడం, వారి ఆకాంక్షలు, విశ్వాసాలు, ప్రోత్సాహాలు అందకపోవడం వంటి వాటన్నింటికీ ఏకైక కారణం పితృస్వామ్య భావజాలమ'ని గట్టిగా చెప్పారు. ఇంకా, 'ఈ పితృస్వామ్య రంగు మనందరిపై చెరగని మరకని వేస్తుంది. అది లేత గులాబిరంగైనా కావచ్చు.. లేదా ముదురు ఎరుపులా భయంకరమైనది కూడా కావచ్చు' అని కూడా ఆమె ఓ ఇంటర్వ్యూలో అన్నారు.

**సంస్థ ఏర్పాటు..**

2005లో ముంబయి కేంద్రంగా 'ఎడ్యుకేట్ గర్ల్స్'కి సఫీనా రూపకల్పన చేశారు. అప్పటికే దేశంలో 2 లక్షలకి పైగా స్వచ్ఛంద సంస్థలు ఆడపిల్లల అక్షరాస్యతకై శ్రమిస్తున్నాయి. అయినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో సఫీనా ఓ ప్రత్యేకమైన మార్గాన్ని ఎంచుకున్నారు. మానవ వనరుల మంత్రిత్వ శాఖని సంప్రదించి, లింగవివక్ష అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితా తెప్పించుకున్నారు.

రాజస్థాన్‌లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించారు. మొదట 50 స్కూళ్లతో ఈ ప్రయాణం మొదలైంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా 29 వేల గ్రామాలలో 3 లక్షలకు పైగా లబ్ధిదారులతో ఈ సంస్థ పనిచేస్తోంది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో సంస్థలో పేర్లు నమోదుచేసుకుని విద్యనభ్యసిస్తున్న ఆడపిల్లలు ఉన్నారు.

'చదువుకున్న తల్లి, తన సొంత బిడ్డకి విద్యనేర్పించే అవకాశం 500 రెట్లు అధికంగా ఉంటుందన్న' అధ్యయనాలని సఫీనా ఎప్పుడూ గుర్తుచేస్తుంటారు. ఆమె బాటలోనే పిల్లలు కిమయ, రెహానా, భర్త చిత్ర నిర్మాత హన్సల్ మెహతా కూడా ప్రాజెక్టులో భాగమవుతారు. స్కూళ్లకి వెళ్లి 'ఎవరెవరు బడికి రావడంలేదు.. ఎందుకు రావడం లేదు..' వంటి కారణాలపై కొన్ని వందలమంది బృందాలుగా మారి అధ్యయనం చేస్తారు.

ఆడపిల్లల విద్యపై సఫీనా చేసిన అధ్యయనం ఆమె మాటల్లోనే.. 'భారత్‌లో చాలాచోట్ల ఇప్పటికీ ఆడపిల్లల చదువు అనవసరమైన విషయంగా ఉంది. పితృస్వామ్యం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అంతరాలు లక్షలాది బాలికలని స్కూళ్ల నుండి బయటికి పంపుతున్నాయి. 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఆ పిల్లల కోసం పనిచేస్తుంది. 7 నుండి 14 ఏళ్ల లోపు ఆడపిల్లల్లో ఎవరు విద్యకి దూరమయ్యారో అన్వేషించేందుకు మా బృందం విరామం లేకుండా అన్వేషిస్తుంది. కౌమార దశలోని ఎందరో ఆడపిల్లలకు ప్రాథమిక అభ్యాసం కూడా లేదని మా సర్వేలు చెబుతున్నాయి. వారందరినీ 'సెకండ్ ఛాన్స్' పేరుతో అక్కున చేర్చుకుంటాం. విద్య, ఉపాధి చూపించడమే కర్తవ్యంగా వారిని కేంద్రీకృతం చేస్తాం. ప్రభుత్వం తరపున విద్యనందించే అవకాశాలు వెతుకుతాం' అని చెబుతున్న సఫీనా బాలికల విద్య కోసం ఎన్నో లక్ష్యాలు ఏర్పరచుకుని పనిచేస్తున్నారు.

ప్రపంచంలోనే మొట్టమొదటి డెవలప్‌మెంట్ ఇంపాక్ట్ బాండ్ (డిఐబి)కి ఈ సంస్థ గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. ఏర్పరచుకున్న 160 శాతం లక్ష్యాల్లో 116 సాధించింది. ఈ విజయం సంస్థని ఆసియాలోనే మొట్టమొదటి ఆడాషియప్ ప్రాజెక్టుగా నిలబెట్టింది. ఇలా 'ఎడ్యుకేట్ గర్ల్స్' అందుకున్న అవార్డులు, ప్రశంసలు, అధిగమించిన సవాళ్లు అనేకం.

సఫీనా మాటల్లో చెప్పాలంటే.. 'మా లక్ష్యం ఇంకా పూర్తవ్వలేదు. చదువుకు దూరమైన ప్రతి అమ్మాయి తిరిగి స్కూలుకి వెళ్లాలి. తనకెదురైన ప్రతి అడ్డంకిని విచ్ఛిన్నం చెయ్యాలి. సవాళ్లని అధిగమించాలి. విద్య ఆడపిల్లలకు ఒక ప్రత్యేకమైన హక్కు కాదు. అది అందరీ హక్కు. భవిష్యత్తు మార్గాలకు అది తొలి అడుగు. అందుకే మా మిషన్ నిజాయితీ గల ఎందరో వ్యక్తులతో పనిచేస్తోంది. గ్రామ స్థాయి నుండి పనిచేసే వాలంటీర్లు, సంస్థ బోర్డు సభ్యులు, సిఇఒ, మేనేజర్లు ఇలా ఎందరో చేసే పనుల్లో అమ్మాయి చదువు కేంద్రంగా ఉంటుంది' అంటున్నారు.

## మైకేల్ జాక్సన్‌లా పవన్

పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా 'ఉస్తాద్ భగత్‌సింగ్' పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. హరిహర వీరమల్లు తరువాత పవన్ నటించిన చిత్రాల్లో ఓజీ, ఉస్తాద్‌భగత్‌సింగ్ ఉన్నాయి. గబ్బర్‌సింగ్ తర్వాత హరీష్‌శంకర్-పవన్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' కావడంతో ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలనే పెట్టుకున్నారు. మోడ్రన్ మైకేల్ జాక్సన్‌లా నిలబడిన పవన్ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. బ్లాక్ అండ్ బ్లాక్ సూట్. పైన హ్యాట్...ఆ స్వాగ్.. వెనుక డ్యాన్సర్లు.. టైమ్.. వంటివి కన్పిస్తున్నాయి.

## దీపావళికి 'మిత్ర మండలి'

నిర్మాత బన్నీ వాస్ నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. దీపావళి పండుగను పురస్కరించుకొని ఈ సినిమా అక్టోబర్ 16న విడుదల కానుంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం, విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఆర్ఆర్ ధ్రువన్ సంగీతం. ఛాయాగ్రాహకుడిగా సిద్ధార్థ్ ఎస్‌జె, ఎడిటర్‌గా పీకే, కళా దర్శకుడిగా గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా రాజీవ్ కుమార్ రామా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్, పాటలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.



## 'ఇది కథ కాదు జీవితం' షూటింగ్ ప్రారంభం

ఫాతిమా ప్రొడక్షన్స్-2 బ్యానర్‌పై డాక్టర్ సయ్యద్ జాఫర్ సమర్పణలో 'ఇది కథ కాదు జీవితం' సినిమా షూటింగ్ ప్రారంభమైంది. కథానాయకుడు బాందారపు మూర్తి నం.1 క్లాప్ కొట్టి మాట్లాడారు. తాను శివంగి, బ్లేడ్‌బ్యాచ్ వంటి సినిమాల్లో కథానాయకుడిగా నటించానన్నారు. ఆరోజు ఏమి జరిగిందంటే సినిమా త్వరలోనే విడుదల కానుందన్నారు. 'సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం, జీవితం, ఎదురయ్యే నిరంతర సంఘర్షణలను పట్టిచూపేలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. మధ్యతరగతి ప్రజల జీవన చిత్రాన్ని పట్టిచూపేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సగటు మనిషి రోజువారీ జీవితాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్నాం. పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని వయస్సుల వారిని ఈ సినిమా చక్కగా ఆకట్టుకుంటుంది. ఈ సినిమా మంచి చిత్రంగా నిలిచి అవార్డు గెల్చుకుంటుందనే నమ్మకం ఉంది' అని యువ దర్శకుడు అనిల్‌కుమార్ అన్నారు. డాక్టర్ సయ్యద్ జాఫర్; విజయ లక్ష్మి, భవాని, నితీష్‌కుమార్, దుర్గా, త్రినిత, ఝాన్సీ, దేవి, ప్రణీత, రామ తీర్థ, రమ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

## 12న 'మిరాయ్' విడుదల

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో పేరు సంపాదించిన తేజ సజ్జా తాజాగా 'మిరాయ్' చిత్రంతో అలరించడానికి వస్తున్నాడు. ఈ సినిమా ఈనెల 12న థియేటర్లలో విడుదల కానుంది. సినిమాటోగ్రాఫర్, దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ సినిమాను తెరకెక్కించారు. ఇటీవల విడుదల చేసిన మూడు నిమిషాల ట్రైలర్ సోషల్ మీడియాలో బాగా ట్రెండింగ్‌లో ఉంది. ఇందులో యోధుడిగా తేజ కనిపించబోతున్నాడు. పీపుల్ మీడియా మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో విఎఫ్ఎక్స్ బాగా ఆకట్టుకునేలా ఉంటాయని నిర్మాతలు తెలిపారు. మంచు మనోజ్, సీనియర్ నటి శ్రియ కీలక పాత్రలో నటిస్తున్నారు.

## మంచి చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ : తమ్మారెడ్డి



'తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పరిశీలిస్తే గడిచిన వందేళ్ల కాలంలో మంచి చిత్రాలకు ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుంది. మంచి కుటుంబ, ప్రేమకథా, చారిత్రక, సందేశాత్మకచిత్రాలతోపాటుగా కొన్ని హర్రర్ చిత్రాలు కూడా ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకున్నాయి. మాతంగుల దుర్భర జీవితాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలుసుకుని చాలా బాధపడ్డా. ఇలాంటి బాధితుల జీవితాలపై తీసిన 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్) సినిమా కూడా ప్రేక్షకుల హృదయాలను గెల్చుకుంటుందనే నమ్మకం ఉంది' అని ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమాను సిహెచ్ వెంకట రవీంద్రనాథ్ ఎంఎస్ దర్శకత్వంలో తెరకెక్కించారు. చెన్నెబోయిన చిన వెంకటస్వామి సమర్పణలో నిర్మాతగా చెన్నెబోయిన నరసమ్మ వ్యవహరించారు. సంగీతం సంతోష్ కావాలి, డిఒపి పి.భరత్‌రాజ్ కమల్, ఎడిటర్ కెవివై పాపారావు. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, రాజశేఖర్, సైదులు, నాగ్‌తేజ్, చిట్టిబాబు, రమ్య, రజనీ, డాలీ నటించారు.

# సూపర్-4కు భారత్

- చివరి లీగ్‌లో కజకిస్తాన్‌పై 15-0తో గెలుపు
- 3న దక్షిణ కొరియాతో ఢీ

**రాజ్‌గిరి(బీహార్):** ఆసియాకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు వరుస మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. రాజ్‌గిరి వేదికగా కజకిస్తాన్‌తో సోమవారం జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 15-0గోల్స్‌తో ఘన విజయం సాధించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి భారతజట్టు 11-0గోల్స్ ఆధిక్యతలో నిలిచినా.. రెండో అర్ధభాగంలో ఎక్కువ గోల్స్ చేసే అవకాశం దక్కినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. అభిషేక్ శర్మ నాలుగు గోల్స్ చేయగా.. జుగ్‌రాజ్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ మూడేసి గోల్స్ చొప్పున చేశారు. రాజిందర్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్, దిల్‌ప్రీత్, హర్మన్‌ప్రీత్ ఒక్కో గోల్ చొప్పున కొట్టారు. దీంతో భారతజట్టు గ్రూప్-ఎలో 3 మ్యాచుల్లో గెలిచి అగ్రస్థానంలో నిలువగా.. చైనా 2వ స్థానంలో నిలిచి సూపర్-4కు అర్హత సాధించాయి.

చైనా-జపాన్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 2-2గోల్స్‌తో డ్రా అయ్యింది. భారత్, చైనా, మలేషియా, కొరియా జట్ల మధ్య సూపర్-4 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ దశలో ప్రతి జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కోసారి తలపడనుంది. టాప్-2 స్థానాల్లో నిలిచిన రెండు జట్లు ఫైనల్లో తలపడనున్నాయి.

**సూపర్-4కు భారత్, చైనా**

ఆసియా కప్‌లో సూపర్ 4 బెర్తులు ఖరారాయ్యాయి. గ్రూప్ 'ఏ' నుంచి భారత జట్టుతో పాటు చైనా గ్రూప్ 'బి' నుంచి కొరియా, మలేషియాలు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. మలేషియా జట్టు చివరి లీగ్ మ్యాచ్‌లో 15-0తో చైనీస్ తైపేని, దక్షిణ కొరియా జట్టు 5-1గోల్స్ తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించాయి. దీంతో ఈ గ్రూప్‌నుంచి ఈ రెండుజట్లు సెమీస్‌కు చేరాయి. గ్రూప్-ఎ నుంచి జపాన్, కజకిస్తాన్, గ్రూప్-బి నుంచి బంగ్లాదేశ్, చైనీస్ తైపీ జట్లు 4, 5వ, 8వ స్థానాలకు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లు సెప్టెంబర్ 3 నుంచి జరగనున్నాయి. జపాన్‌తో చైనీస్ తైపీ, బంగ్లాదేశ్‌తో కజకిస్తాన్ జట్లు పోటీపడనున్నాయి.

**సూపర్-4 షెడ్యూల్...**

| | |
|---|---|
| 3(బుధ) | : మలేషియా × చైనా |
| | భారత్ × కొరియా |
| 4(గురు) | : కొరియా × చైనా |
| | భారత్ × మలేషియా |
| 6(శని) | : కొరియా × మలేషియా |
| | భారత్ × చైనా |
| 7(ఆది) | : ఫైనల్ |

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | డ్రా | ఓ | చే.గో. | ఇ.గో. | గో.వ్య. | పా |
|---|---|---|---|---|---|---|---|---|
| గ్రూప్-ఎ... | | | | | | | | |
| 1. భారత్ | 3 | 3 | 0 | 0 | 22 | 5 | +17 | 9 |
| 2. చైనా | 3 | 1 | 1 | 1 | 18 | 7 | +11 | 4 |
| 3. జపాన్ | 3 | 1 | 1 | 1 | 11 | 5 | +6 | 4 |
| 4. కజకిస్తాన్ | 3 | 0 | 0 | 3 | 1 | 35 | -34 | 0 |
| గ్రూప్-బి... | | | | | | | | |
| 1. మలేషియా | 3 | 3 | 0 | 0 | 23 | 2 | +21 | 9 |
| 2. ద.కొరియా | 3 | 2 | 0 | 1 | 13 | 5 | +8 | 6 |
| 3. బంగ్లాదేశ్ | 3 | 1 | 0 | 2 | 10 | 12 | -2 | 3 |
| 4. చైనీస్ తైపీ | 3 | 0 | 0 | 3 | 3 | 30 | -27 | 0 |

## రైబకినాకు వోంద్రుసోవా షాక్

### క్వార్టర్స్‌లో సబలెంకతో ఢీ

### జకోవిచ్, ఫ్రిట్జ్, డి మినర్ కూడా... యుఎస్ ఓపెన్

**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో మరో సంచలనం నమోదైంది. 9వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన ఎలెనా రైబకినా అనూహ్యంగా ప్రి క్వార్టర్స్‌లో ఇంటిదారి పట్టింది. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ మార్కెటా వోండ్రుసోవా చేతిలో 4-6, 5-7, 2-6తో మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలైంది. మరో పోటీలో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన సబలెంక 6-1, 6-4తో సి. బక్సా(స్పెయిన్)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్‌ఫైనల్లో వీరిద్దరూ ముఖాముఖి తలపడనున్నారు.

ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి సెర్బియా స్టార్, 24గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-3, 6-3, 6-2తో అన్‌సీడెడ్, జర్మనీకి చెందిన స్టఫ్‌ను చిత్తుచేశాడు. ఇక 4వ సీడ్, అమెరికాకు చెందిన ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో 21వో డ్, చెక్‌రిపబ్లిక్‌కు చెందిన మచాక్‌ను ఓడించాడు. మరో ప్రి క్వార్టర్స్‌లో 8వ సీడ్ డి-మినర్(ఆస్ట్రేలియా) 6-3, 6-2, 6-1లో అన్‌సీడెడ్ లియాండ్రో(స్విట్జర్లాండ్)ను చిత్తుచేశాడు.

## సత్తా చాటిన పుణేరి పల్టన్స్

### ప్రొ కబడ్డీ సీజన్-12



పట్నా రైడర్‌ను అడ్డుకుంటున్న యుపి ఆటగాళ్లు

**విశాఖపట్నం:** ప్రొ కబడ్డీ సీజన్-12లో పుణేరి పల్టన్స్ సత్తా చాటింది. గుజరాత్ జెయింట్స్‌పై ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 41-19 పాయింట్లతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ అస్లామ్ (5పాయింట్లు) సత్తా చాటగా.. డిఫెండర్ అభినేశ్, రైడర్ ఆధిత్య ఆరేసి పాయింట్లతో పుణేరి గెలుపులో కీలకపాత్ర పోషించారు. మరో రైడర్ పంకజ్ కూడా ఐదు పాయింట్లతో సత్తా చాటడంతో గుజరాత్ జట్టు కోలుకోలేకపోయింది. ఇక గుజరాత్ జట్టులో రాకేశ్(6పాయింట్లు) మినహా మరే రైడర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. యుపి యోధాస్, పట్నా పైరెట్స్ జట్ల మధ్య జరిగిన మరో ఉత్కంఠ పోటీలో యుపి జట్టు గెలిచింది. ముఖ్యంగా రెండో అర్ధభాగంలో యుపి జట్టు పట్నాపై అత్యధిక పాయింట్లు సాధించడం గమనార్హం.

**ప్రొ కబడ్డీలో నేడు...**
**దబాంగ్ ఢిల్లీ × బెంగళూరు బుల్స్(రా.8.00గం॥లకు)**
**జైపూర్ పింక్‌ప్యాంథర్స్ × పట్నా పైరెట్స్(రా.9.00గం॥కు)**


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68